సాహిత్య వినోద వీచికలు

పూర్వకవుల సాహిత్యంలోని చమత్కార వినోద విషయ వీచికలు

ఏర్చి కూర్చి వార్చినది-

అలంకారం వెంకటరమణరాజు(ఏ. వి. రమణరాజు)

సాహిత్య వినోద వీచికలు

పూర్వకవుల సాహిత్యంలోని చమత్కార వినోద విషయ వీచికలు

ఏర్చి కూర్చి వార్చినది-

అలంకారం వెంకటరమణరాజు

(ఏ.వి.రమణరాజు)

చిత్రసాహితి ప్రచురణలు

28/244, రామేశ్వరం, ప్రొద్దుటూరు - 516360

షష్టిపూర్తి సందర్భంగా..........

వెల: అమూల్యం

కూర్పరి – ఏ.వి.రమణరాజు తల్లిదండ్రులు

తల్లి : శ్రీమతి లక్ష్మిదేవమ్మ, తండ్రి : అలంకారం ఆదిశేషం రాజు, పెంచిన తల్లి: శ్రీమతి కామేశ్వరమ్మ

ఇప్పుడీ పుస్తకం ఎందుకట?

మనం ప్రత్యేకించి సాహిత్యంలో ధారణ శక్తిని కోల్పోయి చాల కాలమయింది. మన పూర్వులు అంటే మనముందు తరంవారు మాట్లాడే సమయంలో మాటల మధ్య అనేక పద్యాలు సామెతలు జాతీయాలు హాస్యస్ఫోరకమైన చమత్కారమైన మాటలు వినిపించేవి నేడు అవి కానరావడంలేదు కదా! మనం మొదట వేదాల ను కూడా ముఖతా నేర్చుకొన్నదే ఇప్పటికి దాదాపు ముఖేముఖే సరస్వతి అని మౌఖింగానే ఆయాశాఖా పద్ధతులను బట్టి వేదం నేర్పబడుతూంది. కానీ మిగిలినవేవీ ఇలా నోటికి నేర్చుకోవటంలేదు. 50 సంవత్సరాలకు పూర్వం మొదట చదువంటే అమరము,ఆంధ్రనామసంగ్రహం, ఆంధ్రనామశేషం, వేంకటేశాంధ్రము ఇలాంటినిఘంటువులు మొదట నేర్పేవారు ఇప్పుడలాంటిలేవుకదా! ఇంక నోటికేమొస్తాయి రావుగాకరావు. అందుకే ప్రతిదీ పుస్తకాలపైనే ఆధారపడవలసి వస్తుంది. కానీ ఇప్పుడవి కూడ అదృశ్యమైపోతున్నాయి పుస్తకాలు కొనేవారు లేరు. చదివేవారు లేరు అన్నీ సెల్ ఫోనులోనే అయింది నేడు రేపేమౌనో. అందుకే ఈ పుస్తకాన్ని డిజిటల్ మోడ్ లోనే పి.డి.ఎప్. రూపంలో అందిస్తున్నాం అదీ ఉచితంగా. దీన్ని అందరూ తమకు ఆప్తులైనవారికే కాక మనతెలుగువారందరికి చేరేలాచూడగలరని మనవి. మనజాతి సంపదను ఒకతరంవారు తరువాతి తరంవారికి అందిచడం అనే మన ముందు తరాలవారు ఆనవాయితీగా చేస్తూనేఉన్నారు దానిలో భాగంగానే ఇది మనం మనవారందరికీ అందిచాలన్నది ఉద్దేశ్యం.

మనతెలుగులో చాటువులను పూర్వకవుల అజ్ఞాతకవుల అంతరించిపోతున్న సాహిత్యాన్ని పరిరక్షించి పరిశోధించి పాఠకుల ముందుంచిన వారికి మనం శతధాసహస్రధా ధన్యవాదాలు చెప్పుకోవాలి మరీ ఆధునిక కాలంలో పరిశోధకులుగా చెప్పదగినవారు శ్రీ **వేటూరి** ప్రభాకర శాస్త్రి గారు వీరు **చాటుపద్యమణిమంజరి**పేరున, **చాటుపద్యరత్నాకరం** పేరున శ్రీ **దీపాల** పిచ్చయ్యగారు, **నానార్థగాంభీర్యచమత్కారిక** పేరున శ్రీ **కుచ్చర్లపాటి సూర్యనారాయణరాజు**గారు, **శృంగారయుక్తి చమత్కార పద్యరత్నావళి** పేరున **శ్రీనేదునూరి గంగాధరం** గారు, **కవితా మహేంద్రజాలం** పేరున **డా॥ ప్రసాదరాయ కులపతి** గారు, **వినోద సాహిత్య వైచిత్ర్యాలు** పేర శ్రీ **సూరపనేని వేణుగోపాలరావు**గారు, **సాహిత్యసాగరంలో ఏఱినముత్యాలు** పేరున **శ్రీతంగిరాల వేంకట కృష్ణ సోమయాజులు** గారు, సంస్కృతంలో **చాటుధారాచమత్కారసార:** పేరున **శ్రీఅల్లమరాజు సుబ్రహ్మణ్య కవి** గారు,**వినోదశతకం** పేరున **డా॥ ప్రమోదినీ పండా** ఇలా చెబుతూ పోతే ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు ధన్యవాదాలు

ఇకపోతే ఈ పుస్తకంలో ఏముంది అంటే వినోదాన్ని కాదనేవారుండరనే చెప్పాలి. చమత్కారం కోరనివారూ ఉండరు హాస్యం వద్దనేవారు ఉండరు వీటఇన్నిటి వేళవింపుతో కూర్చినది ఈ పుస్తకం (సాహిత్య వినోద వీచికలు) చమత్కార పద్యాలు, సంవాద పద్యాలు, వ్యంగానుకరణ(పేరడీ),సమస్యాపూరణలు,చిన్న చిన్నచమత్కార కథలు, ఏకాక్షర ద్వ్యక్షర పద్యాలు, ప్రహేళికలు, పొడుపుకథలు, చ్యుతాక్షర పద్యాలు, ప్రశ్నోత్తర పద్యాలు, అనులోమ విలోమ పద్యాలు ఇలా ఎన్నొ ఇందులో కూర్చబడినవి. సుమతీ శతకం కూడ వ్యాఖ్య కావాలని కొరుకొనే నేటిపాఠకలోకానికి తగినవిధంగా ప్రతి పద్యానికి ఇందులో వివరణ ఇవ్వడం జరిగిందిఅయినా ఈ పుస్తకం చూచిన ప్రతిఒక్కరు అమాంతంగా దీన్ని ఇష్టపడతారనినేననుకోను లోకోభిన్నరుచి: అని కదా కాలం అనంతమైంది దేశం విశాలమైంది నాలాటి వారు నాతో సమానమైన లక్షణాలు కలవారు తప్పక ఉంటారని నా నమ్మకం. నా లోసగం నా అర్థాంగలక్ష్మి శ్రీమతి ఇందిరాదేవి నాకందించే సహకారానికి సదా కృతజ్ఞతలు. పుస్తకాన్ని మీముందుకు తేవడానికి సహకరించిన నా కుమారులు, కోడలు, నాతమ్ముడు అలంకారం విజయకుమార్ లకు ఆశీస్సులు.

ఇట్లు
బుధజన విధేయుడు, సాహితీమిత్రుడు
ఏ.వి.రమణరాజు

07- 04 - 2022 - ప్రొద్దుటూరు

అంకితం

నాకు జన్మనిచ్చిన తల్లి

లక్ష్మిదేవమ్మకు,

పెంచినతల్లి

కామేశ్వరమ్మకు,

తండ్రి

అలంకారం ఆదిశేషంరాజుకు,

అక్షర గురువులు

తంగెళ్ళ నారాయణరాజుకు,

నన్ను నడిపే ఆధ్యాత్మక గురువులు

బాబూజీ మహరాజ్ శ్రీరామచంద్ర గురూజీ గారికి,

గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ గారికి

సాహిత్య వినోద వీచికలు

..... ఏ.వి.రమణరాజు

చమత్కార విఘ్నేశ్వర ప్రార్థన -

అరుదుగ వామభాగలలనాకలనాచలనాత్ముఁడైన యా

హరుగురుఁగాంచి తానును దదాకృతియౌగతి నేకదంతుఁడై

కరికరణీగుణంబులు మొగంబునఁ దాల్చి జగంబు లేలు నాం

తరకరుణాననాథు గణనాథు మరిద్గణనాథుఁ గొల్చెదన్

(కావ్యాలంకారసంగ్రహము -1-6)

తన తండ్రి అయిన ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడు అంటే సగం పురుషభాగము సగం స్త్రీ భాగము కలవాడు. అలాగే నేను కూడ అర్ధనారీశ్వరుడని ఈ రూపం ధరించాడట గణపతి. అంటే గణపతి స్వరూపంలో ఒక భాగంలో దంతం ఉంటుంది మరో భాగంలో దంతం ఉండదు అందుకే ఆయన్ను ఏకదంతుడంటారు. ఏనుగుల విషయానికొస్తే దంతాలున్నది మగ ఏనుగు దాన్ని కరి అంటారు. దంతాలు లేని దాన్ని కరణి(ఆడ ఏనుగు) అంటారు. అందు వల్ల గణపతి ముఖంలో ధంతం ఉండేభాగం పురుషభాగం అలాగే దంతంలేని భాగం స్త్రీభాగం. కావున గణపతి కూడ అర్ధనారీశ్వర తత్వం కలవాడే. కావున తన తండ్రి ఈశ్వరునితో సమానుడు. అటువంటి గణనాథుని నేను కొలుస్తానంటున్నాడు

మన కావ్యాలంకారసంగ్రహము(నరసభూపాలీయము)లో భట్టుమూర్తి(రామరాజభూషణుడు) .ఈ భావన ఈయనకు ఎలావచ్చిందంటే ఈయనకు 8 శతాబ్దాల ముందు ఉన్న మహాపండితుడు శివభక్తుడు అయిన "హలాయుధుడు" అనే ఆయన కూర్చిన హలాయుధస్తవములో ఇలాంటి భావన ఉన్న శ్లోకం ఉందట. ఆ శ్లోకం

విఘ్నం నిఘ్నన్ ద్విరదవదన: ప్రీతయేవో2స్తు నిత్యం

వామేకుంఠత్ ప్రకటిత బృహదక్షిణేస్థూల దంత:

య: శ్రీకంఠం పితరమునుయాశ్లిష్ట వామార్థదేహం

దృష్ట్వానూనం స్వయమపి దధావర్ధనారీశ్వరత్వం

ఈ విషయం "గణపతి-తెలుగు సాహిత్యం" అనే వ్యాసంలో
నిడుదవోలు వెంకట్రావుగారు భారతి మాసపత్రికలో వివరించారు.

+++++

2. చమత్కార విఘ్నేశ్వర ప్రార్థన .

తనయుని యొక్క యెత్తుననె దక్షజయు న్నిటలాక్షుఁడున్ముదం
బున నిరిచెక్కులుం గదిసి ముద్దు గొనంగ నొకింత నెమ్మొగం
బనువుగ పెన్కకుం దిగిచి యత్నవిహీనపరస్పరాస్యచుం
బనలు దల్లిదండ్రులకుఁ బన్నుగఁ గూర్చు గజాస్యు నెన్నెదన్

(అప్పకవీయం1-22)

ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు తమ కుమారుడైన గణపతిని
వారిద్దరిమధ్య కూర్చోబెట్టుకొని ఇద్దరూ ఒకేమారు అతనిని ముద్దు పెట్టుకోవాలనుకున్నారు. తీరా
వారట్లు ముద్దు పెట్టుకొనె సమయంలో గణపతి తనముఖం క్రిందికి దించుకున్నాడు.
దానితో అనుకోకుండా పార్వతీ పరమేశ్వరులిద్దరూ,
ఏ ప్రయత్నం లేకుండానే, ఒకరినొకరు ముద్దు పెట్టుకున్నారు.
ఆవిధంగా తల్లిదండ్రులను కూర్చిన గజాస్యుని నేను ప్రార్థిస్తున్నాను - అంటున్నాడు అప్పకవి.

+++++ 3

చమత్కార ఆశీర్వాదాలు(దీవెనలు)

శ్లో. విష్ణో రాగమనం నిశమ్య, సహసా కృత్వా ఫణీంద్రం గుణం
కౌపీనం పరిధాయ చర్మకరిణః శంభుః పురోధావతి:
దృష్ట్వా విష్ణురథం సకంప హృదయః సర్పో పతత్ భూతలే
కృత్తి ర్వి స్ఖవితా హ్రియా నతముఖో నగ్నో హరః పాతువః

శివుడు దిగంబరంగా ఉన్నాడు. విష్ణువు వస్తున్నాడని తెలిసింది. పామును మొలతాడుగా, గజచర్మాన్ని కౌపీనంగా పెట్టుకొని వెళ్ళాడు. గరుత్మంతుని చూడగానే పాముకు గుండెలవిసి కిందపడింది. గోచీ వూడిపోయింది. నగ్నుడై తలవంచుకొని వున్న పరమేశ్వరుడు మిమ్ము రక్షించుగాక - అని భావం

ఇందులో శంకరుని దిగంబరత్వం, పామునకు గరుత్మంతునకు గల సహజవైరం మొదలైనవానితో కవి చమత్కారపూర్వకంగా ఆశీర్వదించాడు

+++++4

కచకుచ చిబుకాగ్రే పాణిషు వ్యాపితేషు

ప్రథమ జలధి - పుత్రీ - సంగమే2నంగ ధామ్ని

గ్రథిత నివిడనీవీ - గ్రంథినిర్మోచనార్థమ్

చతురధిక కరాశ: పాతు నశ్చక్రపాణి:!

లక్ష్మితో చతుర్భుజ భగవానుని ప్రథమ సమాగమం జరుగుతూంది. ఆయన నాలుగు చేతులూ నాలుగు చోట్ల - లక్ష్మి స్తనాలపైన, వెంట్రుకల పైన, ఆమె గడ్డంపైన వ్యాపించి ఉన్నాయి. ఇక బిగిసిన నీవీ బంధ విమోచనం ఎలాగు? ఈ అక్కర కోసం అదనంగా మరో చెయ్యి కోరుకునే విష్ణు భగవానుడు మమ్ములను రక్షించుగాక! - అని భావం

+++++5

లీలాశుకుని శ్రీకృష్ణలీలామృతములోని శ్లోకం -

కృష్ణే నామ్బ గతేన రన్తు మధునా మృద్భక్షితా స్వేచ్ఛయా

తథ్యం కృష్ణ క ఏవ మాహ ముసలీ మిథ్యామ్బ ప శ్యాననమ్

వ్యాదేహీతి విదారితే శిశుముఖే దృష్ట్వా సమస్తం జగ

న్మాతా యస్య జగామ విస్మయపదం పాయా త్స వః కేశవః

బలరాముడు - కృష్ణే నామ్బ గతేన రన్తు మధునా మృద్భక్షితా స్వేచ్ఛయా

(అమ్మా మన కృష్ణుడు ఆడుకొనడానికి పోయి,

ఇష్టమువచ్చినట్లు మన్నుతిన్నాడు)

యశోద - కృష్ణ తథ్యం ? (ఏమిరా కృష్ణా(మన్నుతిన్నది) నిజమేనా ?

కృష్ణుడు - క ఏవ మాహ ? (లేదమ్మా ఎవరు చెప్పింది?)

యశోద- ముసలీ (బలరాముడు)

కృష్ణుడు - మిథ్యామ్బ ప శ్యాననమ్ (అది కల్లమాట కాదేని నానోరు చూడుము (నోరు తెరచాడు)

యశోద నోటిలో ఎల్లలోకములు చూచి ఆశ్చర్యపడునది

అటువంటి కృష్ణుడు మమ్ములను కాపాడుగాక!

++++++++6

లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతంలోనిది. ఇది గోపికకు బాలకృష్ణునికి మధ్యజరిగిన సంవాదం

కస్త్వం బాల బలానుజః కిమిహతే మన్మన్దిరాశఙ్కయా

యుక్తం తన్నవనీతపాత్రవివరే హస్తం కిమర్థం న్యసేః,

మాతః కశ్చన వత్సకం మృగయితుం మాగా విషాదం క్షణా

ది త్యేవం వరవల్లవీ ప్రతివచః కృష్ణస్య పుష్ణాతు నః

గోపిక - కస్త్వం బాల?(ఎవరు నీవు?)

బాలకృష్ణుడు - బలానుజః (బలరాముని తమ్ముని)

గో- కిమిహతే? (ఇక్కడ ఏమిపని?)

బా.కృ- మన్మన్దిరాశఙ్కయా(మాయిల్లనుకొని భ్రమతో వచ్చాను)

గో- యుక్తం తన్నవనీత పాత్రేవివహే హస్తం కిమర్థం న్యసేః

(అదిసరే వెన్న కుండలో చేయెందుకు పెట్టావు)

బా.కృ.- మాతః కశ్చన వత్సకం మృగయితుం (మా దూడ ఒకటి తప్పి పోయినది- అది ఈ బానలో ఉందేమో నని వెదకుచున్నాను)

మాగా విషాదం క్షణాద్ (కొంచెం సేపు ఊరకుండు పోతానులే)

ఇత్యేవం వరవల్లనీ ప్రతివచః కృష్ణస్య పుష్ణాతు నః!

ఈవిధంగా గొల్లపడుచుకు జవాబులిచ్చు కృష్ణుడు మమ్ములను రక్షించుగాక!

++++++++7

మాతః కిం యదునాథ దేహి చషకం కిం తేన పాతుం పయ

స్తన్నా స్త్యద్య కదాస్తి వా నిశి నిశా కావా2న్ధకారోదయః,

ఆమీ ల్యాక్షియుగం నిశా ప్యుపగతా దేహీతి మాతుర్ముహు

ర్వక్షోజాంశుకకర్షణోద్యతకరః కృష్ణ స్స పుష్ణాతు నః

లీలాశుకుని శ్రీకృష్ణామృతములోనిది యశోదాకృష్ణుల సంవాదము ఇది -

కృష్ణుడు - హేమాతః! (ఓ అమ్మా!)

యశోద - కిం యదునాథ? (ఓ యాదవులరాజా ఏమిరా?)

కృ- దేహి చషకం (నాకూజాను తెమ్ము)

య- కిం తేన? (దానితో ఏమి పని)

కృ - పాతుం పయః (పాలను త్రాగుటకు)

య - తత్ అద్య నాస్తి ((ఆ గిన్నె)ఆపాలు ఇప్పుడు లేవు)

కృ - కదా ఆస్తినా? (ఎప్పుడు ఉంటాయి)

య - నిశి (రాత్రి యందు) , కృ - నిశా కా? (రాత్రి అంటే ఏది)

య - అన్ధకారోదయః (చీకటి పడుట) - అనగానే

ఆమీల్యాక్షియుగం (రెండు కన్నులు గట్టిగా మూసుకొని)

కృ - నిశాప్యుపగతా దేహీతి (రాత్రికూడ వచ్చింది పాలగిన్నె తెమ్ము) అని

మాతుః వక్షోజాంశుకకర్షణోద్యతకరః కృష్ణ స్స పుష్ణాతు నః!

తల్లి అయిన యశోద పైటకొంగును లాగుటకై చాచబడిన

చేయిగల ఆ శ్రీకృష్ణుడు మమ్ము రక్షించుగాక!

+++++8

విశాఖదత్తుని **ముద్రారాక్షసనాటకం**లోని (నాటకాలు మొదలైన రూపకాలకు మొదట చేసే ప్రార్థనను నాంది అంటారు)నాందీ శ్లోకం

పార్వతీపరమేశ్వర సంవాదం

ధన్యా కేయం స్థితా తే శిరసి? శశికలా, కిం సునా మైత దస్యా:

నామై వాస్యాస్తదేతత్, పరిచిత మపి తే విస్మృతం కస్య హేతో:?

నారీం పృచ్ఛామి నేన్దుం? కథయ తు విజయా, న ప్రమాణం యదీన్దు:

దేవ్యా: నిహ్నోతు మిచ్ఛో: - ఇతి సురసరితం శౌర్య మవ్యా ద్విభో ర్వ:

శివుని జటాజూటంలో విలీనమై ఉన్న గంగనుచూచి, ఈర్ష్యపడిన పార్వతి శివునితో ఈ విధంగా సంభాషణ ప్రారంభించింది.

పార్వతి - (పరమ ప్రేయసినైన నేను నీ(శంభుని) వామభాగంలో అర్ధాంగిగా ఉండగా) **ప్రభూ! నాభర్తవైన మీ(శివుని) ఉత్తమాంగమును (శిరసును)**

అధిష్ఠించిన ధన్యురాలు ఎవరు?

(అసూయతో ఎత్తిపొడుస్తూ ప్రశ్నించింది)

శివుడు - (తన నెత్తినున్న గంగను కప్పిపుచ్చాలనుకొని)

శశికలా (చంద్రలేఖ)(అని) **శశి**(స్త్రీలింగంతో, వ్యాజోక్తి ధ్వనింప చేస్తూ సమాధానమిచ్చాడు)

పా. - **అయితే ఈవిడ పేరేమిటి**?

శివుడు - **దానిపేరూ అదే. నీకు తెలుసుకదా!**

ఎందుకు మరిచిపోయావు?

(శివుని మోసాన్ని గుర్తించిన పార్వతి)

పా. - **నాథా! నేనడిగేది ఆ చంద్రరేఖను గురించికాదు.**

మీ జటాజూటంలో ఉన్న ఆ అపరిచిత యువతిని గురించండీ!

శివుడు - (నన్నడిగిన విజాతీయ "ఇన్దు" ప్రధానకర్మకమైన ప్రత్యుత్తరం)

నీకు ప్రమాణంకాకపోతే సజాతీయతననుసరించి, నీకు విశ్వాసపాత్రురాలైన నీ సఖి ఆ విజయనే అడుగు.

ఈ విధంగా వాక్యాలంతో తన తలపై ఉన్న గంగాదేవిని కప్పిపుచ్చటానికి ప్రయత్నించిన ఆ పరమేశ్వరుని ఛలోక్తి మనలను రక్షించుగాక! - అని కవిభావన.

++++++++++9

ఆనందవర్ధన కృత **వక్రోక్తి పంచాశిక** అనే కృతిలోనిది ఈ శ్లోకం.

(ఈ కృతిలో మొత్తం 50 శ్లోకాలుఉన్నాయి.)

త్వం హాలాహల భృత్కరోషి మనసో మూర్ఛాం మమాలింగత:

హాలాం నైవ బిభర్మి నైవ చ హలం ముగ్ధేకథం హాలిక:

సత్యం హాలిక త్రైవ తేసముచితాసక్తస్య గోవాహనే

వక్రోక్త్యేతి జితో హిమాద్రిసుతయా స్మేరో హర: పాతు వ:

పార్వతి - **నీవు హాలాహల భరుడవు కౌగిలింపబడి**
నా మనస్సునకు మూర్ఛ గావించుచుంటివి.

శివుడు - **ఓసి ముగ్ధా నేను హాలను(సురను) హలము(నాగలి)**
భరించువాడను కాదు హాలికుడనుకొంటివా?

పార్వతి - **సత్యమే ఎద్దునెక్కు నీకు హాలికత్వము తగును.**

- అని పార్వతి వక్రోక్తిచే జయింపబడి నవ్వు
శివుడు మిమ్ము రక్షించుగాత!

+++++10

కస్త్వం? **శూలీ,** **మృగయ భిషజం?** నీలకంఠ: ప్రియే2హమ్

కేక మేకాం కురు? పశుపతి:, **నైవ దృశ్యే విషాణే?**

స్థాణు: ముగ్ధే!? **న వదతి తరు: జీవితేశ: శివాయా:**

గచ్ఛాటవ్యాం, ఇతి హతవదా: పాతు వ: చంద్రచూడ:

పార్వతి - ఎవరునీవు?

శివుడు - శూలీ (త్రిశూలాన్ని ధరించే శివుని)

(శూలీ -శివుడు, కడుపునొప్పిగలవాడు)

పా.- శూలరోగం గలవానివి వైద్యుని వెతుక్కుంటూ వెళ్ళు.

శి.- ప్రేయసీ నేను నీలకంఠుడనే

(నీలకంఠ - శివుడు, నెమలి)

పా.- నీలకంఠవైతే ఒక కేక(నెమలి అరుపు) వేయి.

శి.- నేను నందీశ్వరుడను.

(నందీశ్వరుడు - శివుడు, పశువులకు, గోవులకు ... పతి)

పా.- అయితే పశువులకు కొమ్ములుండాలికదా అవి నీకు కనపడడంలేదే?

శి.- ఓసి మూర్ఖురాలా! నేను స్థాణువును.

(స్థాణువు - శివుడు, కదలని చెట్టు, మొద్దులు..)

పా.- చెట్టు లేదా మొద్దు అయితే మాట్లాడవుకదా! నీవు మాట్లాడుతున్నావే!

శి.- నేను పార్వతికి ప్రాణేశ్వరుడను శివుడను. (శివా - పార్వతి, నక్క)

పా.- నీవు నక్కవైతే అడవిలో తిరగాలి అక్కడ ఉండక ఇక్కడికెందుకొచ్చావు పో అడవికి పో.

పార్వతి ప్రశ్నలకు జవాబివ్వలేని చంద్రశేఖరుడు మిమ్మలను రక్షించుగాక!

+++++11

మౌలౌ కిం సు? మహేశ! మానిని! జలం. కిం వక్త్రం? అంభోరుహం.

కిం నీలాలక వేణికా? మధుకరీ, కింభ్రూలతా? వీచికా.

కిం నేత్రే? శఫరౌ, కిము స్తనయుగం? ప్రేంఖత్ రథాంగద్వయం

సాశంకా మితి వంచయన్ గిరిసుతాం గంగాధర: పాతువ:

పార్వతి - పరమేశా నీతలపై నున్నదెవరు?

శివుడు - అభిమానవతీ (శ్లిష్ట వక్రోక్తితో) నీరు(జలం) సుమా(గంగ)

పా.- ఏదో ముఖంలాగా కూడా అక్కడ కన్పడుతోంది అదేమిటి?

శి.- ఆ నీటిలో మొలిచిన కమలము(అంభోరుహము) సుమా!

పా.- అదేమిటండీ నల్లని వెంట్రుకలతో జడమాదిరిగా కూడా కనపడుతోంటే?

శి.- ఔను, అది ఆ పద్మాలలోని, తేనెను ఆస్వదింప వచ్చిన తుమ్మెదల గుంపు.

పా.- అయితే, తీగలవలె కనుబొమ్మలు కూడా కనబడుచున్నాయేమిటి?

శి.- ఏమీలేదు. ఆ నీటిలోని తరంగాలు(అలలు) సుమా!

పా.- రెండు కళ్లు కూడా కనపడుతుంటే వాటినేమిటి దాస్తారు?

శి. - అబ్బే! అవి ఆ నీళ్లలోని చేపలు సుమా!

పా. - గుండ్రంగా రెండు కుచాలు(స్తనాలు) కూడా ఉన్నాయండీ?

శి.- ఔను! ఆ జలంలో తిరుగుచున్న చక్రవాక పక్షులజంట.

ఇలా అసూయతో అనుమాన పడిన,

ఆ అంబకు(పార్వతికి) నర్మగర్భంగా, అలంకారిక సాంప్రదాయానుసారంగా, వక్రోక్తులతో

సమాధానమిచ్చి సరిపెట్టిన

ఆ గంగాధరుడు (ఈశ్వరుడు) మనందరిని రక్షించుగాక.!

+++++12

మామను సంహరించి, యొకమామకు గర్వమడంచి, యన్ని శా

మామను రాజుజేసి, యొకమామతనూజునకాత్మబంధువై

మామకుగన్నులిచ్చి, సుతుమన్మథుపత్నికి దాని మామయై

మామకు మామయైన పరమాత్ముడు మాకు బ్రసన్ను డయ్యె డుస్

1. కంసుడనే మామను చంపి, 2. సముద్రుడనేమామకు గర్వమణచి(రామావతారంలో) 3. చందమామను రాత్రికి రాజును చేసి (నానార్థాలలో రాజు అంటే చంద్రుడు అని ఒక అర్థం) 4. ఒకమామకొడుక్కు(అర్జునునికి) ఆత్మబంధవై, 5. ఒకమామకు కన్నులిచ్చి(రాయబారంలో ధృతరాష్ట్రునికి) 6. రతీదేవికి తానే మామయై, 7. సముద్రుడు విష్ణువుకు మామ, 8.ఈయనకు గంగను ఇచ్చినందున మామకు మామయైనాడు, అటువంటి విష్ణువు ప్రసన్నుడై మాకు అనుగ్రహం కలిగించుగాక!

+++++13

లక్ష్మీ - పార్వతుల సంవాదం

శ్లో. భిక్షార్థీ స క్వయాత:? సుతను బలిమఖం! తాండవం క్వాద్య భద్రే?
మన్యే బృందావనాంతే! క్వను స మృగశిశు:? నైవజానే వరాహమ్!
బాలే! కచ్చిన్నదృష్టో జరఠ మృగపతి:? గోపయేవాత్ర వేత్తా!
లీలా సంలాప ఇత్థం జలనిధి హిమవత్కన్యయో: త్రాయతాం న:!

లక్ష్మీ - బిచ్చగాడు ఎక్కడకు వెళ్ళాడు?

పార్వతి - బలియజ్ఞమునకు!

లక్ష్మీ - ఈనాడు తాండవం ఎక్కడ?

పార్వతి - బృందావనంలో అనుకొందును!

లక్ష్మీ - ఆ జింకపిల్ల ఎక్కడ?

పార్వతి- ఏమో ఆ వరాహమును నేనెరుగను!

లక్ష్మీ - బాలా ముదుసలి ఎద్దు కన్పించలేదా?

పార్వతి- గోవులను కాయువానికే తెలియును!

ఈ విధంగా సాగిన లక్ష్మీ - పార్వతుల సంవాదం మిమ్ము రక్షించుగాక!

+++++14

అరువదిరెండుకుచంబులు

శిరమొక్కడు రెండువేలు చెవులుస్ తానుస్

ఇరువైరెండు భుజంబులు

తరుణీ! ఏయూరు నీది దాచక చెపుమా?

ఈ పద్యం చూడగా అరువదిరెండు కుచములు (చన్నులు), శిరము (తల) ఒకటి, తాను రెండువేల చెవులు, ఇరువైరెండు భుజాలు, దాచకుండా నీది ఏవూరో చెప్పుము తరుణీ (ఓ స్త్రీ)! అనే అర్థం

కనబడుతోంది

ఇది సరైన అర్థంగా కనబడటంలేదుకదా! సరైన అర్థం కావాలంటే దీన్ని ఈ విధంగా అర్థం తీసుకోవాలి.

అరువది అంటే తమిళ స్త్రీ, ఇరువై అంటే ఇరువగు - ఒప్పినట్టి - అని.

ఓ తమిళ స్త్రీ! రెండు కుచములతో, ఒక శిరముతో, రెండు ప్రేలాడు చెవులతో, తగినట్టి రెండు భుజాలతో ఉన్నావు. ఏవూరునీది - అనేది అర్థం.

+++++15

కొండనుండు నెమలి కోరిన పాలిచ్చు
పశువు శిశువు తోడ పలుక నేర్చు
వనిత వేదములను వల్లించు చుండును
బ్రాహ్మణుండు కాకి పలలము దిను

బ్రాహ్మణుడు పలలము(మాంసం) తినడు. కాకి మాంసం ఎవ్వరూ తినరు. అది బ్రాహ్మణుడు తింటాడు - అన్నట్లు అసలే కుదరదు.

పై పాదాలలోని వాటికి అర్థం సమన్వయం కాదు. అందుకే ఇది పొడుపుకథ.

దీనిలో ఉన్న గమ్మత్తంతా ఏమిటంటే ఒక్కొక్కపాదం ఒక్కొక్క వాక్యంగా కనబడటం. ఆవిధంగా కవిరాయడం. దాని అర్థాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

కొండనుండు నెమలి - కోరిన పాలిచ్చు పశువు
శిశువుతోడ పలుకనేర్చు వనిత
వేదములను వల్లించుచుండను బ్రాహ్మణుండు
కాకి పలలము తిను. ఇప్పుడు చిక్కుముడి విడిపోయింది కదా!

+++++16

విష్ణుదేవుని పత్నియై వెలయునెవతె
ఎవ్వరేతేర పాద్యాదు లిచ్చుచుంద్రు
హిమకరుడు పుట్టగా, రాత్రి ఏది వచ్చు
కమలబాంధవుడేతేర కలువవిచ్చె

1. విష్ణుపత్ని ఎవరు? 2. ఎవరు వస్తే పాద్యాదులు ఇస్తూ ఉంటారు?

3. హిమకరుడు(చంద్రుడు) పుట్టగా రాత్రి విచ్చేది ఏది?

కమల బాంధవుడు - సూర్యుడు,

ఏతేర - రాగా, కలువవిచ్చె - కలువ వికసించింది - విపరీతమైనదికదా!

ఎలాసాధ్యం? దీనిలోని చిక్కును విడదీయడం ఏమిటి అంటే చివరి పాదంలోని పదాలను కమల-బాంధవుడేతేర - కలువ విచ్చె - అని విడదీస్తే పై ప్రశ్నలకు సమాధానాలు వరుసగా సరిపోతాయి. చూడండి.

1. విష్ణుపత్ని ఎవరు? - కమల (లక్ష్మి)

2. ఎవరు వస్తే పాద్యాదులు ఇస్తూ ఉంటారు? -

బాంధవుడేతేర (బంధువురాగా)

3. హిమకరుడు(చంద్రుడు) పుట్టగా రాత్రి విచ్చేది ఏది? -

కలువ విచ్చె (కలువపూవు వికసించింది)

+++++17

కరచరణంబులు గల్గియు

కరచరణ విహీనుచేత, గడు దుర్బలుడై,

జలచరుడు పట్టువడియెను,

శిరహీనుడు చూచి నవ్వె చిత్రముగాగస్!

కాళ్ళు చేతులు ఉన్నవాడు బలహీనుడై కాళ్ళు చేతులు లేని వానిచేత పట్టు బడిగా శిరము లేనివాడు చూచి నవ్వాడట ఎంత చిత్రమో! - దీని భావం. కాళ్ళుచేతులు ఉన్నవాని కాళ్ళుచేతులు లేనివాడు ఎలా పట్టుకున్నాడు. అది చూచి తలే లేనివాడు ఎలా నవ్వాడు?

అంటే దీనికి అర్థం ఇదికాదు. కాదు కాదు ఇదే. మరెలాగంటే...............

కాళ్ళుచేతులు ఉన్నవాడు అంటే కప్ప, కాళ్ళుచేతులు లేనివాడు అంటే పాము. శిరసులేనివాడు - పీత (ఎండ్రి). ఇప్పుడు కాళ్ళుచేతులు ఉన్న కప్పను కాళ్ళుచేతులు లేని పాము నోట చిక్కింది. అది చూచి తలలేని పీత నవ్వింది. ఇది అసలు భావం.

++++++18

క్రీ.శ. 1324లో నివసించిన అమీర్ ఖుస్రూ పారశీక కవి.

ఈయన హిందీలోనూ కవిత్వం చెప్పినవాడు. ఒకానొకచోట తను ఢిల్లీపరిసరాల్లో మాట్లాడే భాషలోనే కవిత్వం రాస్తానన్నాడు.

ఒక ఫారసీ పద్యంలో ఈ విధంగా అన్నాడు.

చు మన్ తూతియే హిందమ్, అర్ రాస్త పుర్సీ

జెమన్ హిందు యీ పుర్స్, తానగ్జ్ గోయమ్

(వాస్తవంగా నేను భారతీయ శుకమను- నన్నేదయిన అడుగదలచిన హిందుయీ లో అడుగుడు. అందు మధురముగా మాటాడ గలను.) ఇక్కడ హిందుయీ అనగా హందీకి మొదటి పేరు. ఈ కవి చెప్పిన

ఒక పొడుపు పద్యం

బాలా థాజబ్ మస్ కో భాయా

బడా హుు వా కుచ్ కామ్ న ఆయా

ఖుస్రూ క హ దియా ఉస్కా నాఁవ్

బూఝొ నహీతో ఛోడో గాంవ్

(బాల్యమున అది మనోహరమైనది. పెఱిగిన పిదప ఎందుకును పనికిరాలేదు (ఖుస్రూ అన్నాడు) దానిపేరు ఊహించండి లేదా ఊరు విడిచి పొండు)

సమాధానము - దీపం

+++++19

ఏక్ థాల్ మోతీసే భరా,

సబ్ కే సర్ పర్ ఔంథా ధరా,

చారోఁ ఓర్ వో థాల్ ఫిరై,

మోతీ ఉస్ సే ఏక్ న గిరై.

(ముత్యములతో నిండిన ఒక పళ్లెరము అందఱ తలలపైన బోర్లించి ఉన్నది ఆ పళ్లెరము నాల్గు

వైపుల తిరుగుచున్నను అందుండి ఒక ముత్యమైనను రాలదు.)

సమాధానము - ఆకాశము

+++++20

ప్రాకృతంలో "సురసున్దరీచరియం" అనే కావ్యం ఒక ప్రేమాఖ్యానం.

దీన్ని క్రీ.శ. 1095లో "ఘనేశ్వరసూరి" రచించాడు.

ఇందులో 4001 గాథలున్నాయి. దీనిలో ప్రధానమైన కథ సురసుందరీ కథ. ఇది చాల చిన్నకథ. దీనిచుట్టు అనేక కథలు అల్లబడ్డాయి. దీనిలో సురసుందరి మకరకేతును పెండ్లాడుతుంది. వీరిద్దరు ఉద్యానవనంలో క్రీడించే సమయంలోని ప్రశ్నోత్తరచిత్రం ఇక్కడ గమనిద్దాం.

కిం ధరఇ పిన్నచందో, కిం వా ఇచ్ఛంతి పామరా ఖిత్తే

ఆమంతసు అంతగురుం కిం వా సోక్ఖం పుణో సోక్ఖం

దట్ఠూణ కిం విసట్ఠఇ కుసుమవణం జణియజణమణాణందం

కహ ణు రమిజ్జఇ పఢమం పరమహిలా జారపురిసేహిం

ఇందులోని అన్ని ప్రశ్నకు సమాధానం - స-సం-కం

1. పూర్ణచంద్రుడు తనలో దేనిని ధరిస్తాడు

జ.- ససం (చెవుల పిల్లిని ధరిస్తాడు)

2. వ్యవసాయదారులు వ్యవసాయానికి ఏమి కావాలని కోరుకుంటారు

జ.- కం (జలం)

3. చివర గురువున్న (గణం) ఏది? జ.- స (స - గణం)

4. సుఖం ఏది? జ.- సం -శం(సుఖం)

5. మళ్లీ సుఖం ఏది ? జ.- కం (సుఖం)

6. పుష్పసముదాయాలు ఎవనిని చూచి వికసిస్తాయి

జ.- ససంకం - శశాఙ్కమ్ (చంద్రుణ్ణి)

7- పరస్త్రీ ఎవరైనా జారపురుషునితో మొదట ఎలా రమిస్తుంది

జ.- సశంకం (శంకిస్తూ, భయపడుతూ)

+++++21

కమల గర్భుండరయగా ముఖస్థదారు,

రమకు నాయకుండరయ ఉరస్థదారు,

ప్రమథ నాయకడరయ శిరస్థదారు,

దీని భావమేమి ....

పారసీ భాషలో దార్ శబ్దానికి కలవాడు, ఉంచుకొనువాడు - అనే అర్థాలున్నాయి. అదే సంస్కృతంలో ధార శబ్దానికి భార్య అని అర్థం.

ఈ రెండు భాషా శబ్దాలతో కవి త్రిమూర్తులను అన్యాపదేశంగా, చమత్కారంగా, అపహాస్యం చేస్తున్నాడు.

కమలగర్భుడు బ్రహ్మ. బ్రహ్మ నోటిలో సరస్వతి ఉంటుందికదా!

అందుకే ముఖస్థదారు అంటున్నాడు. రమకు నాయకుడు విష్ణువు.

విష్ణువు ఉరములో లక్ష్మీదేవి ఉంటుంది. కావున ఉరస్థదారు అన్నాడు.

ప్రమథ గణాలకు నాయకుడు శివుడు. శివుడు గంగను శిరస్సుపై ఉంచుకున్నాడు. కావున ఆయన శిరస్థదారు.

ఇదే పొడుపు పద్యాన్ని వేమన పద్యాలలో

పడతి మోసెనొకడు, పడతి మేసెనొకడు

పడతి నెదను బెట్టి బ్రతికె నొకడు

పడతికొరకు నిట్లు పలుపాట్లు పడిరయా

విశ్వదాభిరామ! వినురవేమ!

దీనికి విరుగుడులాంటి పద్యం

స్త్రీ నెత్తిన రుద్రునకు

స్త్రీ నోటను బ్రహ్మకెపుడు సిరిగల్కంగా

స్త్రీ నెదిరి రొమ్మున హరికి

స్త్రీ నెడపగ గురుడవీవు దేవర వేమా!

+++++22

ఇంటికి వింటికి బ్రాణ మేది చెప్పుమ?

కంట మింటను మనమేమి కాంచగలము?

నవ్వు, పువ్వు దేనినుండి వొలుపు గాంచు?

ఒకటే రెండేసి ప్రశ్నల కుత్తరంబు.

పై పద్యంలో ప్రతి పాదంలో 2 ప్రశ్నలు ఉన్నాయి. ప్రతి రెండు ప్రశ్నలకు సమాధానం ఒకటిగానే ఉండాలి. అవి ఆలోచించి చూడగా......

ఇంటికి ప్రాణం ఏది? - **ఇల్లాలు** (స్త్రీ)

వింటికి ప్రాణం ఏది? - **అల్లెత్రాడు**

ఈ రెంటిని నానార్థాలుగల పదం - **నారి**

కంట (కంటిలో), మింటిలో(ఆకాశంలో) మనం ఏంచూస్తాము

మనకంటిలో చూసేది ఏది? - **కంటిపాప**

ఆకాశంలో మనం చూసేది ఏది? - **నక్షత్రాలు**

కంటిపాపను, నక్షత్రాలను నానార్థాలుగా గల పదం - **తార**

నవ్వుగాని దేన్ని చూసి సంతోషపడతాము - **వలపు**(ప్రేమ),

పువ్వు దేనితో కలిసి అందంగా ఉండగలవు - **వాసన**

వలపు, వాసన రెండింటికి కలిపి నానార్థంగా ఉన్న పదం ఏది - **వలపు**

+++++23

కిం క్రూరం స్త్రీహృదయం

కం గృహిణ: ప్రియహితాయ దారగుణా:

క: కామస్సంకల్ప:

కిం దుష్కరసాధనం ప్రజ్ఞా   (దండి - దశకుమారచరిత్ర)

ఇందలి ప్రశ్నలు సమాధానాలు

1. కిం క్రూరం (క్రూరమైనదేది)? - **స్త్రీల మనస్సు**(స్త్రీ హృదయం)
2. కిం గృహిణ: ప్రియహితాయ (గృహస్థునకు ఇష్టమైనదేది)?

- **భార్యగుణము**(దారగుణా:)

3. క: కామ (కామము ఏది)? - **సంకల్పమే**(సంకల్ప:)

4. కిం దుష్కరసాధనం (కష్టమైన పనులను సాధించునది ఏది)?   - **బుద్ధి** (ప్రజ్ఞా)

+++++24

భాస్కరరామాయణాన్ని రచించిన నలుగురు కవులలో ప్రధానమైనవాడు
హుళక్కి భాస్కరుడు. భాస్కరరామాయణాన్ని కృతిగా అందుకున్నవాడు
సాహిణిమారు(డు)న. ఈయనను గురించి హుళక్కి భాస్కరుడు చెప్పిన
ఈ ప్రహేళిక లేక పొడుపు కథ లాంటి పద్యం చూడండి-

అప్పులిడు నతడు ఘనుడా?

అప్పు డొసగి మరల పొందు నాతడు రాజా

చెప్పగవలె సాహిణి మా

రప్పను దానమున ఘనుడు, రాజు నటంచున్

అప్పు ఇచ్చేవాడు గొప్పవాడా - అని సామాన్యంగా అర్థమౌతుంది.
అప్పులు ఇచ్చేవాడు తీర్చేవాడు కాదు ఇక్కడ.
అప్ అంటే సంస్కృతంలో నీరు - దాన్ని తెలుగు పదంగా మార్చటం వల్ల
అప్పుగా మారింది. ఇక్కడ అప్పులిచ్చేవాడు ఘనుడా అంటే మేఘము
అప్పుడొసగి మరల పొందు నాతడు రాజా - దీనిలో
రాజు అంటే భూమిని పాలించేవాడు, చంద్రుడు ఇక భావంలోకి వస్తే
నీటిని ఇచ్చే మేఘునికంటె, తన కళలను ఇచ్చి తిరిగి
స్వీకరించే చంద్రునికంటె దానంలో సాహిణి మారప్ప గొప్పవాడు - అని భావం.

+++++25

నన్దామి మేఘాన్ గగనేऽవలోక్య

నృత్యామి గాయామి భవామి తుష్ట:

నాహం కృషిజ్ఞ పధికోऽపినాహం

వదంతు విజ్ఞా మమ నామధేయమ్

ఆకాశంలో మేఘాలను చూస్తే నా మనసు వికసిస్తుంది. నాట్యమాడతాను, పాటలుపాడతాను, ఆనందం కలుగుతుంది.

నేను కృషీవలునికాను పధికునికాను. మీకు నాపేరు తెలిస్తే చెప్పండి

రైతు ఆకాశంలో మేఘాలను చూస్తే ఆనందిస్తాడు ఆడతాడు పాడతాడు.

ఎండతాపానికి అలసిపోయిన ప్రయాణికుడు మేఘాలను చూచి ఆనందంతో గంతులేస్తాడు పాటలుపాడతాడు ఈ శ్లోకం రైతుకాదు ప్రయాణికుడు కాదంటోంది.

దీన్ని బాగా ఆలోచిస్తే ఈ లక్షణాలు మయూరానికి అంటే నెమలికి సరిపోతాయి కావున దానిపేరు -

నెమలి(మయూరము)

+++++26

ప్రహేళికలను సైనికులు, గూఢచారులు శత్రురాజుల వివరాలను తెలియపరచడానికి వాడేవారు అనడానికి ఈ ప్రహేళిక ఉదాహరణ-

హరిద్రాయాం రాహుప్రసరపిహితేచ్ఛాపరిషది

ప్రయుక్తాలంకృత్యైవియుత గరుతాం దుర్గకురటీం

వయం సార్క్ పేతా: ప్రహర ఇతి పేనాధిపకృతాం

అమాత్యేభ్యో లేఖాం ప్రతిదిశతి సింహక్షతిపతి:

హరిద్రా, రాహు, ఇచ్ఛా, పరిషత్ ప్రయుక్తాలంకృతి, వియుతగరుత్ దుర్గకురటీ, సార్క పదములవలన క్రమంగా రాత్రి చీకటి, దిక్కులు, గుంపు, ప్రహారము, విపక్షములు, దుర్గపురము, నాయక సమేతులు - అనే అర్థాలు స్ఫురిస్తాయి. దీని అసలు అర్థం-

అమాత్యులకు సింహదేశపు రాజు విశదీకరించెను -

మేము ఇక్కడ సేనానాయకుని వశంవదునిగా చేసికొనినాము-

కావున చీకటి బాగా అలుముకొనిన తరువాత దుర్గపట్టణంలో ప్రవేశించి,

శత్రువులను చీల్చవలసినది అని సేనానాయకుడు పంపినాడు - అని అర్థం.

+++++27

నాగరాజ కృత భావశతకములోని ప్రహేళిక గమనించండి-

కాచిత్ సరోజనయనా రమణే స్వకీయే

దూరం గతే సతి మనోభవ బాణఖిన్నా

త్యక్తుం శరీర మచిరాత్ - మలయాద్రివాయుం

సౌరభ్యశాలిన మహో పిబతిస్మ చిత్రమ్

ఒకానొక పద్మాక్షి, తన ప్రియుడు దూరదేశం వెళ్ళగా మన్మథబాణ పీడితురాలై

బాధపడుతూ ప్రాణాలు వదలాలని వెంటనే మలయపర్వతం నుండి చందనగంధంతో వీస్తున్న గాలిని పీల్చడం మొదలు పెట్టిందట

- ఏంటీ చిత్రం. చావాలనుకుంటే గాలిని బంధించి చావాలికదా!

కాని పీల్చడమేమిటని ప్రశ్న-

మలయపర్వతం నుంచి మంచిగంధం చెట్లనుండి వచ్చే గాలిని పీల్చటంవల్ల విరహిణులను బాధలు పెరుగుతాయి కాబట్టి గాలిపీల్చకుండా మానాలి కదా!

అలా చేయడం అంటే - చందనచర్చిత మలయమారుతం

పరిమళం వెదజల్లుతుంది. గాలిమేపరులైన విషసర్పాలు ఆ గాలిని పీల్చి వదలటంవలన ఆ గాలి విషపూరితం అవుతుందికదా!

ఆ గాలిన ఈవిడ పీల్చితే తనకు మరణం వస్తుందని ఈ విరహిణి అలా చేసిందని సమాధానం.

+++++28

సమస్యా పూరణ ఒక అద్భుతమైన సమయస్ఫూర్తి దాయకమైన

ప్రక్రియ మరియు మేధోసంపత్తికి నిదర్శనం.

శ్రీభగవాన్ రమణ మహర్షులవారిచే నాయనా అని పిలిపించుకున్న

వాసిష్ఠ గణపతిముని తన యౌవన ప్రారంభ దశలో నవద్వీపం వెళ్లి

అక్కడి పండిత పరిషత్తువారి సభలో పాల్గొని ఆశుకవిత, సమస్యాపూరణ, వ్యాఖ్యాన నైపుణి

అద్భుతంగా ప్రదర్శించి కావ్యకంఠ నిరుదును పొంది తెలుగువారి విజయపతాకం వచ్చాడు.

అక్కడ ఇవ్వబడిన సమస్య ఒకటి ఇప్పుడు తెలుసుకుందాం.

"స్తన వస్త్రం పరిత్యజ్య వధూః శ్వశురమిచ్ఛతి"

- అనేది సమస్య (అనగా- కుచాలమీది గుడ్డను తీసివేసి కోడలు మామను కోరుతున్నది.)

దీన్ని పతివ్రతాపరంగా పూరించాలని పృచ్ఛకుని నియమం.

సమాధానం(పూరణ)-

హిడింబా భీమదయితా నిదాఘే ఘర్మపీడితా

స్తన వస్త్రం పరిత్యజ్య వధూ: శ్వశురమిచ్ఛతి

(భీముని భార్య హిడింబ ఆటవిక. ఎండవేళ చెమట బాధతో ఆమె ఉపరివస్త్రం తొలగించి మామగారైన వాయువును కోరింది. అంటే గాలికోసం పై గుడ్డ తీసేసిందని. అర్థం.)

ఇది అనేక అవధానాలలో సమస్యగా ఇవ్వడం జరిగింది.

ఇక్కడ కొన్నిటిని గమనిద్దాం.

1. **కుస వస్త్రంబు పరిత్యజించి సతి తా కోరెస్ తమిస్ మామనుస్**

దీనికి శ్రీ కడిమెళ్ళ వరప్రసాదుగారు ఈ విధంగా పూరించారు.

శుచి సాహస్రము మిన్ను ముట్టినదియో చోద్యమ్ముగా సూర్యుడే

అచలుండౌచును ఆత ప్రసరణ వ్యాపారముస్ పూనెనో

విచలత్ గాత్రి హిడింబ గత్తమున పెస్వీకుల్ జనింపంగ తత్

కుచ వస్త్రంబు పరిత్యజించి సతి తా కోరెస్ తమిస్ మామనుస్

2. **శ్వశరునిగోరె సాధ్వి స్తనవస్త్రము తానె త్యజించి అద్దిరా**

దీన్ని శాంతిశ్రీ బొత్సాకవిగారు ఈ విధంగా పూరించారు.

అశమిత భీష్మగ్రీశ్మ సమయంబున ఊష్మభరంబు నోర్వగా

వశమది గాక ప్రాణులకు ప్రాణము త్రాణము వాయుదేవునిస్

విశచరియైన భీము రమణీమణి అల్ల హిడింబ డంబునస్

శ్వశరుని గోరె సాధ్వి స్తనవస్త్రము తానె త్యజించి అద్దిరా

ఏకవి ఏభాషలో పూరించినా ఈ సమస్య భావము కావ్యకంతునిదే చెప్పి ఉన్నారు.

+++++29

సమస్య - **పతిని త్యజించి యొక భామ పతివ్రత యయ్యె నిమ్ముగన్**

ఈ సమస్య విజయవాడ రేడియో కేంద్రంలో విజయవాడ వాస్తవ్యులు **శ్రీకావూరి పూర్ణచంద్రరావు**గారు ఆహూతుల సమక్షంలో చేసిన ఆవధానంలో పూరించారు. దమయంతి నలుని తన భర్తగా భావించి ఇంద్రుని వదలిన ఘట్టాన్ని తీసుకొని ఈ విధంగా పూరించాడు.

మతి విభవంబు లుట్టిపడ మాకు సమస్య నొసంగినారు భా

రతి ధరిత్రిలోన నలరాజు మతిందలపోసి యెవ్వ రే

గతి వచియించినన్ వినక కమ్ర గుణాఢ్య తనంత పూర్వదిక్

పతిని త్యజించి యొక భామ పతివ్రత యయ్యె నిమ్ముగన్

+++++30

సమస్య - **చంద్రశేఖరోప్యర్క శేఖర:**

చంద్రశేఖరుడైనను సూర్యశేఖరుడు - అనే ఈ సమస్య సంస్కృతభాషలోనిది. దీనికి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారి పూరణ-

నిరజనాటవీ మధ్య దుస్థితే

భిన్న భిత్తికే కంటకాంచితే

శూన్య దేవతామందిరే భవత్

చంద్రశేఖరోప్యర్క శేఖర:

మనుషులులేని అడవిలో దేవాలయం శిథిలమైంది. గోడలు పడిపోయాయి. ముళ్ళు, జిల్లేళ్ళు మొలిచాయి. శివలింగం పక్కన జిల్లేడు చెట్టు మొలిచి లింగంపైన ఆక్రమించుకొంది. దానితో చంద్రశేఖరుడు కూడా అర్కశేఖరుడైనాడు. ఇక్కడ శర్మగారు అర్క శబ్దానికి **సూర్యుడు** అనికాక **జిల్లేడు** అనే అర్థం తీసుకొని చమత్కరించాడు

+++++31

"**ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్**"- అనే

ఈ సమస్యకు పలు పూరణలు చూడండి.

చదవన్నేర్తురు పూరుషుల్ బలెనె శాస్త్రంబుల్ పఠింపించుచో

నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్పుచో

నుదితోత్సాహము తోడ నేలగలరీ యుర్విన్ బ్రతిష్ఠించుచో

ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్.

(చిలకమర్తివారి "ప్రసన్నయాదవం")

ఆచంట సత్యవతమ్మగారి పూరణ పద్యం -

చదువుల్ సాములు శాస్త్రచర్చ, ధరణీ రాజ్ఞీత్వశిల్పంబులున్

కదనంబందున రక్తి, గాన కవితా విజ్ఞాన సారథ్యముల్

సుధలం జిమ్మెడి పాకశాస్త్ర విదితం బాబాల లాలిత్యమున్

ముదితల్ నేర్వగరాని విద్యగలదా ముద్దార నేర్పించినన్

(గృహలక్ష్మి- 1931 అక్టోబరు)

చిల్కపాటి సీతాంబ పూరణ పద్యం -

అదనంబౌనలు రేట్లు నారులకు ధీయంయండ్రందు నందమ్ము మిం

చెదరన్ కుత్సిత పుందలంపుననో, సౌశీల్యంబు భగ్నంబగున్

జదురెక్కంగుల కాంతలన్న వెఱనో, శాసించిరిల్ దిద్దనే

ముదితల్ నేరఁగ రాని విద్యగలదే ముద్దార నేర్పించినన్

(గృహలక్ష్మి- 1931 అక్టోబరు)

+++++32

భోజ కాళిదాసు సమస్యలు -

భోజరాజు ఒకరోజు రాత్రి ఆకల్లాడక తీవ్రమైన ఉక్కతో

అంత:పురకాంతలను తాకనైనా లేక కేవలము

కనుసన్నలచేతనే ఆలింగనాదులన్నీ అనుభవించుచూ

సరససల్లాపమలచేతనే కాలక్షేపము చేసి ఆ రాత్రి నిదురించెను.

మరునాడు సభలో తాను అనుభవించిన దాన్ని ఒక సమస్యగా ఇచ్చాడు.

సమస్య - **మరుదాగమవార్తయా2పి శూన్యే**

సమయే జాగ్రతి సంప్రవృద్ధతాపే

(గాలివచ్చు అనుమాట కూడలేని పెనువేసవికాలములో

ఉమ్మదము, వేడిమి మిక్కిలి తీవ్రమవుచుండగా.....)

దీన్ని భవభూతి ఈవిధంగా పూరించాడు.

ఉరగీ శిశవే బుభుక్షవే స్వా

మదిశత్ఫూత్కృతిమాననానిలేన

(ఆ సమయంలో ఆడుపాము ఆకలితో ఉన్న

తనపిల్లనోటిలో తన నోరుపెట్టి '**ఫూ**' అని ఊది గాలిమేపు ఇచ్చెను.)

దానికి భోజుడు - కవిచంద్రా! లోకోక్తిని చక్కగా సమర్థించి చెప్పావు

చాల సంతోషమైంది- అని అన్నాడు.

తరువాత కాళిదాసు వైపుచూడగా ఈవిధంగా పూరించాడు.

అబలాసు విలాసినో2స్వభూప

న్నయనై రేవ నవోపగూహనాని

(విలాసపురుషులు తమ ప్తియురాండ్ర ఎడ నూతన ఆలింగనములను కన్నులచేతనే

అనుభవించినవారైరి) అని చెప్పగా

రాజు మనసులోని అభిప్రాయమునే చూచినట్లు సూటిగా చెప్పినందులకు

చాల సంతోషముతో సన్మానము చేసెనట.

+++++33

ఒకమారు ముగ్గురు వ్యక్తులు భోజరాజు దర్శనానికి వెళ్ళగా వారికి ఉచితరీతిని సత్కరించి మీరేమైనా శ్లోకాలు రాశారా? అని ప్రశ్నించాడు. దానికి వారు ఇప్పటికి ఏమీ రాసుకొని రాలేదు నెలపైతే రాసుకొని వస్తామని చెప్పి సెలవుతీసుకున్నారు. కానీ కవిత్వమంటే ఏంటో వారికి తెలియదు వారు రాయాలని ఆలోచన ప్రారంభించారు.

ఆశ చెడ్డదికదా! ఏలాగైనా నాలుగు పాదాలు కూర్చుకొని ఒక శ్లోకమైనా పూర్తి చేయాలని ముగ్గురు కూడబలుక్కొని ఒక్కొక్కపాదం ఒకరు పూర్తి చేసేవిధంగా మాట్లాడుకున్నారు. ఎంత ప్రయత్నించినా ఎవరికీ ఏమీ తెలియడంలేదు. వారిలో ఒకడు సాధారణంగా అనుకొనే ఒకపాదాన్ని గుర్తుకురాగా అది చెప్పి గండం గడిచిందనుకున్నాడు. ఆ పాదం-

అనిత్యాని శరీరాణి

రెండవవాడు ఎప్పుడో విన్న పాదం చెప్పి తనగండం గడిచిందనుకున్నాడు. రెండవ పాదం -

శాకాయ లవణాయ చ

మూడవవాడు చిన్నప్పుడు చదివిన బాలరామాయణశ్లోకంలోని పాదం చెప్పి ఊరకున్నాడు. ఆ పాదం -

కూజన్తం రామ రామేతి

మూడు పాదాలు పూర్తయినాయి కాని నాలుగవపాదం
ఎంతప్రయత్నించినా వారి వల్లకాలేదు. మాటిమాటికి ఆ పాదాలనే
వల్లెవేస్తూ దారిలో వెళుతున్నవారిని కాళిదాసు వారి అవస్థనుచూచి
నాలుగవపాదం పూర్తిచేసి ఇక మీకు సన్మానం జరుగుతుంది రాజుదగ్గరకు రండి అని చెప్పి లోనికి వెళ్ళాడు. కాళిదాసు పూర్తిచేసి ఇచ్చిన తర్వాత కడతేరాం దేవుడా! అనుకొని రాజుగారి ముందుకు వెళ్ళారు.

దానిని చూచిన రాజుగారు నాల్గవపాదం చెప్పినవారికి అక్షరలక్షలు ఇచ్చితిని అనగా వారు రాజుగారికి జరిగినదంతా చెప్పారు.

దానితో కాళిదాసును రాజుగారు సత్కరించాడు. ఆ (పూర్తి)శ్లోకం -

అనిత్యాని శరీరాణి

శాకాయ లవణాయ చ

కూజన్తం రామ రామేతి

మత్వా మాగా గళం వహ

వీటి అర్థం-

అనిత్యాని శరీరాణి (శరీరము అనిత్యము)

శాకాయ లవణాయ చ (శాకమునకును, లవణమునకును)

కూజన్తం రామ రామేతి (రామ రామ అని కూయుచున్నది)

ఈ మూడు పాదములకు అతుకు పెట్టి క్రమాలంకారంలో చెప్పాడు కాళిదాసు.

మత్వా మాగా గళం వహ

అనిత్యాని శరీరాణి మత్వా (శరీరము అనిత్యమని తలచి)

శాకాయ లవణాయ చ మాగా:

(శాకమునకును, లమణమునకును పోకుము)

కూజన్తం రామ రామేతి గళం వహ

(రామరామ అని కంఠమున వహింపుము)

దీని భావం -

ఓ నరుడా! శరీరము అనిత్యమని తలచి, కూరగాయలు కావాలని ఉప్పు కావాలని వెంపర్లాడకు.

ఎల్లపుడు రామరామ అని కీర్తనను కంఠంనందు

వహించు అనగా ఎల్లపుడు రామనామాన్ని సంకీర్తన చేస్తూ ఉండు - అని భావం.

+++++34

ఒకమారు ధారాధీశుడైన భోజుడు వ్యాహ్యాళికై వెళ్ళగా బోగమువీధిలో బోగముపడుచుపిల్ల ఒకతె చెవిలో నల్లకలువ పువ్వు పెట్టుకొని చెండాట ఆడుతూంది అలా ఆడే సమయంలో కదలికవల్ల చెవిలోని కలువపూవు జారి కాళ్ళమీద పడింది. అది చూచిన రాజుగారు మనసులో పెట్టుకొని సభకు వెళ్ళాడు. అక్కడ కవీశ్వరులను కందుకాన్ని వర్ణించమని

కోరగా భవభూతి ఈ విధంగా వర్ణించాడు-

విదితం నను కందుక! తే హృదయం

ప్రమదాధర సంగమలుబ్ధ ఇవ,

వనితాకరతామరసాభిహత:

పతిత: పతిత: పునరుత్పతసి

(ఓ కందుకమా! నీ అభిప్రాయం నాకు తెలిసిపోయింది. యువతీమణి తనచేతితో మాటిమాటికి కొట్టుచున్నా కిందపడి కూడ నీవు ఎందులకు మరల పైకెగురుచున్నావో నాకు తెలిసిందిలే ఆవిడ కెమ్మోవిపానకమును త్రాగుటకుకదా!) అని చెప్పెను.

తరువాత మరొకకవి ఈ విధంగా చెప్పాడు

ఏకోऽపి త్రయ ఇవ భాతి కందుకోऽయం

కాంతాయా: కరతలరాగరక్తరక్త:

భూమమౌ తచ్చరణమరీచిగౌరగౌర:

ఖస్థస్సన్ నయనమరీచినీలనీల:

(ఒక కాంత చెండాడుతుంటే ఆ చెండు ఎలావుందంటే - ఆ కాంతామణి అఱచేత చరచునపుడు ఆ అఱచేయి ఎరుపుడాలునకు ఎరుపుగను, చేతి దెబ్బ తగిలి నేలమీద ఆమె కాళ్ళముందర పడినతరువాత ఆమె కాలిగోళ్ళ తెల్లనికాంతి సోకి తెల్లగను, పైరెగిరినపుడు ఆమె ముఖము పైకెత్తి చూడగా ఆ కలువకంటి కన్నుల నీలపుకాంతులతో నల్లనల్లగను మూడురకములుగా ప్రకాశించుచున్నది.) అని చెప్పెను.

ఆ తరువాత కాళిదాసు ఈ విధంగా వర్ణించాడు-

పయోధరాకారధరో హి కందుక:

కరేణ రోషాదభిన్యతే ముహు:,

ఇతీవ నేత్రాకృతి భీతముత్పలం

స్త్రియ ప్రసాదాయ పపాత పాదయో:

(పాలిండ్ల ఆకృతి ధరించినందున ఈ బంతిని ఈ ఇంతి రోషముతో మాటిమాటికి తనచేతితో కొట్టుచున్నది. ఇక ఈ కలువకంటి సాదృశ్యము ధరించిన నాకు మాత్రమీమెవలన ఇలాంటి దండన కలుగకుండునా! అని భయపడి ఆమె చెవిలోపెట్టుకొన్న కలువపూవు ఆమె కాళ్ళపై పడి ఆమె అనుగ్రహమును కోరుచున్న దానివలె తటాలున పాదములపై బడెను) అని వర్ణించెను. భోజరాజు ఆ ముగ్గురికి తగినవిధంగా

బహుమానములిచ్చెను. కాళిదాసును మాత్రం తనమనసులోని విషయాన్ని చూచినవానివలె చెప్పినందులకు ప్రత్యేకముగా సన్మానించెను.

+++++35

ఒక్కొక్క మహాకవి తీరు ఒక్కోవిధంగా ఉంటుంది. అలాంటిది ఒక శ్లోకాన్ని నలుగురు మహాకవులు చెబితే ఎలావుంటుందో? అని ఒకరోజు భోజమహారాజుకు అనిపించిందట. నిజమేకదా!

వెంటనే కాళిదాసు , భవభూతి, దండి మహాకవులను పిలిపించి

సాయంకాలంపూట ఓ చక్కని ఉద్యానవనం మందిరంలో సమావేశం

ఏర్పాటు చేశారు. అందరూ కూర్చున్న తరువాత

మహాకవులారా! ఆ అస్తమిస్తున్న సూర్యుడు కనిపిస్తున్నాడు కదా!

ఎంతో వింతగా కనిపిస్తున్నాడు. మనం అందరం కలిసి ఒక శ్లోకం రాద్దాం.

మొదట నేను ఒక పాదం చెబుతాను తరువాత ఒక్కొక్కరు ఒక్కొకపాదం చెప్పండి అని భోజుడు ఈ పాదం చెప్పాడు.

పరిపతతి పయోనిధౌ పతంగః

(సూర్యుడు పడమర సముద్రంలో పడిపోతున్నాడు) అని భోజుడు చెప్పగా

సరసిరుహా ముదరేషు మత్తభృంగః

(రోజు రోజంతా వికసించిన పద్మాలలోని మకరందాన్ని మకరందాలను

తాగి తాగి ఉన్న తుమ్మెద, అదే పద్మంలో నిద్రకోసం పడకేసుకుంటోంది.)

అని దండి చెప్పాడు.

ఉపవనతరుకోటరే విహంగః

(దగ్గరగా ఉన్న ఉద్యానవనాలన్నింటిలోని చెట్టు తొర్రల్లోకీ, అంటే తమ తమ ఇళ్ళల్లోకి పక్షులు చేరుతున్నాయి) అని భవభూతి చెప్పాడు.

కాళిదాసు చివరి పాదం ఇలా పూరించాడు--

యువతి జనేషు శనై శ్శనై రనంగః

(యౌవనంలో ఉన్న స్త్రీలలోకి మెల్లమెల్లగా మన్మథుడు ప్రవేశిస్తున్నాడు.)

పూర్తి శ్లోకం ఇది -

పరిపతతి పయోనిధౌ పతంగ:

సరసిరుహా ముదరేషు మత్తభృంగ:

ఉపవనతరుకోటరే విహంగ:

యువతి జనేషు శనై శ్శనై రనంగ:

ఈ శ్లోకం నలుగురు చెప్పినా అంత్యాను ప్రాస ఎలా వాడారో చూడండి.

పతంగ: మత్తభృంగ: విహంగ: రనంగ:

+++++36

కృష్ణదేవరాయల ఆస్థానానికి ఒకసారి ఒకకవి వచ్చి అష్టదిగ్గజకవుకు ఒక పరీక్ష పెట్టాడు అదేమంటే మీలో ఎవరు ఏది చెప్పినదాన్ని నేను వెను వెంటనే రాయగలను మరియు మీరు చెప్పిన కవిత్వాన్ని తప్పు పట్టగలను లేదా మీరు నేను చెప్పిన దాన్ని రాయండి, నే చెప్పిన కవిత్వాన్ని తప్పు పట్టండి. వీటికి మీరు సిద్ధమేనా అని ప్రశ్నించాడు. దీనికి అక్కడివారందరూ ఏమీ చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఆసమయంలో తెనాలి రామకృష్ణకవి ముందుకు వచ్చి నే చెప్పేది రాయమని ఈ క్రింది పద్యం చెప్పాడట.

తృవ్వట! బాబా; తలపై

పువ్వట! జాబిల్లి; వల్వబూదట! చేదే

బువ్వట! చూడగ నుళుళు

క్కవ్వట; అరయఁగ నట్టి హరునకు జేజే!

(తృప్ = సాక్షరపదముల గ్రహింపజాలని పశువు - వృషభం, బాబా = వాహనం, జాబిల్లి, తలపై పువ్వు, వలువ = కట్టుపుట్టము, బూచి = భయంకరమైన (ఏనుగు)తోలు, చేదే = హాలాహలమే, బువ్వ = ఆహారం, ఉళుళుక్ (హుళక్కి)= లేనిది - మాయ, అవ్వ = కాగా, అట్టి హరును = అలాంటి పరమశివునకు, జేజేలు)

రామకృష్ణకవి చెప్పెడి విధానం పద్యం పలికే తీరు అర్థం కాక ఆ వచ్చిన కవివతంసుడు రాయలేక నిలిచిపోయాడు.

+++++37

ఎంత చిత్రం! మురారి కొయ్యబారాడా? కాదా! పూరీ జగన్నాథుడు కొయ్యవిగ్రహమేగా! ఎందుకట - ఈ శ్లోకం చూడండి

ఏకా భార్యా ప్రకృతి రచలా చంచలా సా ద్వితీయా

ఏక పుత్రో సకల సృడభూత్ మన్మథో దుర్నివార:

శేషశ్శయ్యా శయన ముదధి: వాహనం పన్నగాశీ

స్మారం స్మారం స్వగృహ చరితం దారుభూతో మురారి:

ఒక భార్య భూమి(ప్రకృతి) ఆమెకు చలనం లేదు. రెండవ భార్య లక్ష్మి బహుచంచల. ఒక కొడుకు బ్రహ్మ అడ్డమైన సృష్టి చేస్తాడు. రెండవకొడుకు మన్మథుడు వానికి పట్టపగ్గాలుండవు. పడుకునే శయ్య పాము. పడక సముద్రంమీద -పాము పీకుతుందో? సముద్రం ముంచుతుందో? వాహనం గరుత్మంతుడు పాములను తినేవాడు ఇలాంటి చరిత్రగల తన ఇంటిని తలచుకొంటూ తలచుకొంటూ మురారి కొయ్యబారి పోయాడు.ఎంత చిత్రం!

+++++38

మల్కిభరామునిపై చెప్పిన పద్యం.

ఆకుంటే వృక్షంబగు;

ఈకుంటే లోభియౌను హీనాత్ముండా

మీకుంటే మాకీయుడు

మాకుంటే మేమురాము, మల్కిభరామా!

దీనికి పేరడీ పద్యం

మీకుంటే చాలు నోకో

మా కుంటే గాదె విద్య మాన్యత గాంచుస్

ఆ కుంటే గల దిచ్చట

ఈ కుంటే లేకయున్న నీప్సితమవుగా

+++++39

ఈ శ్లోకం సరస్వతీదేవి ప్రార్థనలోనిది.

సరస్వతీ నమస్తుభ్యం

వరదే కామరూపిణీ

విద్యారంభం కరిష్యామి

సిద్ధిర్భవతు మే సదా!

దీనికి జరుక్ శాస్త్రి పేరడీ

చోటాహజ్రీ నమస్తుభ్యం

వరదే కామరూపిణీ

కాఫీ పానం కరిష్యామి

సిద్ధిర్భవతు మే సదా!

+++++40

ఈ పద్యం అడిదము సూరకవిని శ్లాఘిస్తూ కొట్ర బాలకవి చెప్పినది.

అంతా కవులముగామా,

అంతింతో పద్దెమైన నల్లఁగలేమా!

దంతివి నీతో సమమా!

కాంతా సుమ బాణ సూరకవి నెఱజాణా!

దీనికి శ్రీ శ్రీ పేరడీ పద్యం.

అంతా సురా ఘటేశులె,

అంతింతో ఆచమాన మడిగేవారే

పంతానికి మాత్రం శివ

చింతా దీక్షితుల మండ్రు, సిరిసిరిమువ్వా!

+++++41

మనుచరిత్రలో ప్రవరుడు సిద్ధునితో అన్న పద్యం

మీ మాటలు మంత్రంబులు

మీ మెట్టినయెడ ప్రయాగ, మీపాదపవి

త్రామతోయము లలఘు

ద్యోమార్గఝురాంబుపౌనరుక్త్యము లుర్విన్ (మనుచరిత్ర 1-62)

దీనికి పేరడీగా దుర్మార్గ చరిత్రమును **విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యేశ్వర** కవి క్రింది పద్యం వ్రాశారు

మీ మాటలు శూలంబులు

మీ మెట్టినయెడ శ్మశానమేదిని మీ అం

ఘ్ర్యామల తోయములు కిటి

స్తోమేడిత కర్దమములు శుంఠాధ్యక్షా!

(కిటి - పంది, స్తోమము - సమూహము, ఈడిత - పొగడబడిన, కర్దమము - అడుసు, బురద)

+++++42

పెద్దనగారి మనుచరిత్రలో ప్రవరాఖ్యుడు సిద్ధుని ప్రశ్నించిన పద్యం ఇది.

ఏయే దేశమువన్ జరించితిరి మీరేయే గిరుల్ చూచినా

రేయే తీర్థములందుఁగ్రుంకిడితి రేయే ద్వీపముల్ మెట్టినా

రేయే పుణ్యవనాళిఁ ద్రిమ్మరితి రేయే తోయముల్ డాసినా

రాయా చోటులఁ గల్గువింతలు మహాత్మా నా కెఱింగింపరే (1-68)

ఈ పద్యానికి అనుకృతి లేదా పేరడీ దుర్మార్గ చరిత్రలోనిది.......

ఏ యే వేశ్యగణంబు నారసితి? రే యే శిష్టులం దిట్టినా?

రే యే కొంపలయందు జొచ్చితిరి? మీ రే చెఱ్ఱులం బూడ్చినా?

రే యే దారుల కంప గొట్టితిరి? మీ రే తోటలం బీకినా?

రా యా దుష్ట విదుష్ట చేష్టలను భ్రష్టా! నాకు చెప్పంగదే!

+++++43

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ఈపద్యం చూడండి. ఇది అంతా ప్రశ్నతోటే ఉంది.

సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు?

చంద్రికలనేల వెదజల్లు చందమామ?

ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసురు?

ఏల నాహృదయంబు ప్రేమించు నిన్ను?

దీనికి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు - సందియం(పేరడి) చూడండి.

జఠర రసమేల స్రవియించు జఠరగ్రంధి?

అడవిలో యేల నివసించు నడవిపంది?

ఏల పిచ్చికుక్క కరచు? కాకేల యరచు?

ఏల తలమీద వెట్రుకలిన్ని మొలుచు?

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 8-4-1983)

+++++44

ఇది బద్దెన సుమతి శతకంలోనిది.

అప్పిచ్చువాఁడు వైద్యుఁడు

నెప్పుడు నెడతెగక పారు నేరును ద్విజుఁడుస్

చొప్పడిన యూరనుండుము

చొప్పడకున్నట్టి యూర చొరకుము సుమతీ!

దీనికి శ్రీశ్రీ పేరడీ పద్యం

ఎప్పుడు పడితే అప్పుడు

కప్పెడు కాఫీనొసంగ గలిగిన సుజనుల్

చొప్పడిన యూరనుండుము

చొప్పడకున్నట్టి యూరు చొరకుము ముప్వా

+++++45 అనుకరణ పద్యాలు

అనువుగాని చోట నధికుల మనరాదు

కొంచెముండు టెల్లఁగొదువ కాదు

కొండ యద్దమందుఁగొంచమై యుండదా

విశ్వదాభిరామ! వినురవేమ!

దీనికి అనుకరణ పద్యం

అనువుగాని వేళ నధికుల మనరాదు

కాలమెఱింగి రీతిఁగడపవలయు

విశ్వమేలు నకులుఁడశ్వశిక్షకుఁడాయె

నేమి సేయవచ్చు నీశ్వరాజ్ఞ

+++++46

శ్రీరమణగారు నూనుడులు పేరుతో చేసి ఉన్నారు.

నూనుడులు - సామెతలు

1. నవ్వే కవిని, ఏడ్చే కార్టూనిస్టును నమ్మకూడదు

(నవ్వే ఆడదాన్ని, ఏడ్చే మగవాణ్ణి నమ్మకూడదు)

2. తిరిగి సబ్ ఎడిటర్, తిరగక రిపోర్టర్ చెడతారు.

(తిరిగి ఆడది, తిరగక మగవాడు చెడతారు.)

3. దొంగలను కొట్టి పోలీసులకు వేసినట్లు

(కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు)

4. తంతేపోయి బారులో పడ్డట్టు (తంతే పోయి గారెలబుట్టలో పడ్డట్టు)

5. బారు పెట్టినవాడు బీరుపోయడా (నారు పోసినవాడు నీరు పోయడా)

+++++47

ఖడ్గసృష్టి లో శ్రీశ్రీ రాసిన "ఏవి తల్లీ" ("THE SNOWS OF YESTER YEAR") (ఇది F. Villon అనుసరణ.) అనే కవిత

చక్రవర్తి అశోకుడెచ్చట?

జగద్గురు శంకరుండెచ్చట?

ఏవి తల్లీ! నిరుడు కురిసిన

హిమ సమూహములు?

కాళిదాస మహా కవీంద్రుని

కవన వాహినిలో కరంగిన

ఉజ్జయిని నేడెక్కడమ్మా

ఉంది? చూపించు?

షాజహాన్ అంత:పురములో

షట్పదీ శింజాన మెక్కడ!

ఝూన్సీ లక్ష్మీదేవి ఎక్కిన

సైంధవం నేడేది తల్లీ?

రుద్రమాంబా భద్రకాళీ

లోచనోజ్వల రోచులేవీ!

ఖడ్గతిక్కన కదనకాహళ

కహకహ ధ్వనులెక్కడమ్మా?

ఎక్కడమ్మా కృష్ణరాయని

బాహు జాగ్రద్భాడబగ్నులు?

బాలచంద్రుని బ్రహ్మనాయని

ప్రాణవాయువు లేవి తల్లీ?

జగద్గురువులు, చక్రవర్తులు,

సత్కవీశులు, సైన్యనాధులు

మానవీరులగు మహారాజ్ఞులు

కానరారేమీ?

పసిడిరెక్కలు విసిరికాలం

పారిపోయిన జాడలోవీ?

ఏవి తల్లీ! నిరుడు కురిసిన

హిమ సమూహములు?

పై కవితకు పేరడీ అబ్బూరి వరదరాజేశ్వరరావు కవితాసంచికలోనిది

నిరుడు విరిసిన నీలగగనం

నేడు కనపడదమ్మా

నిరుడు విరసిన శీతవాయువు

నేడు మసలదు తల్లీ!

నీలిరెక్కల కాలవిహంగం

నీడ జిక్కితి తల్లీ!

జాలికన్నుల కారుచీకటి

మ్రోల నిలిచితి నమ్మా!

ఖంగుమన్నవి మృత్యుదేవత

కాలి యందెలు తల్లీ!

చరమ రాత్రించరుల సన్నిధి

జలదరించితి నమ్మా!

కలల బ్రతుకున గాలిమేడలు

కరిగిపోయినవమ్మా!

వెలితి కన్నుల వెలుగుకోసము

వెదకికొందును తల్లీ!

స్వేచ్ఛకోరిన పేదరక్తము

వెల్లబారిన దమ్మా

జనసమరమున పరాజితుడను

సెలవొసంగుము తల్లీ!

ద్వేషబుద్ధిని ధిక్కరిస్తే

దోషమెవరిది తల్లీ!

తీరులేనిది నేటిలోకము

నేరమెవ్వరి దమ్మా!

+++++48

కాసుల పురుషోత్తమకవి ఆంధ్రనాయక శతకంలోనిది

ఇది ఆంధ్రమహావిష్ణువును గూర్చి రాసినది.

ఆలు నిర్వాహకురాలు భూదేవియై యఖిలభారకుఁడను నాఖ్యఁదెచ్చె

నిష్టసంపన్నురాలిందిర భార్యయై కామితార్థదుఁడన్న ఘనతఁ దెచ్చె

గమలగర్భుఁడు సృష్టకర్తతనూజుఁడై బహుకుటుంబికుఁడన్న బలిమిఁ దెచ్చె

గలుష విధ్వంసిని గంగ కుమారియై పతితపావనుఁడన్న ప్రతిభఁ దెచ్చె
నాంధ్రు బిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిగాని
మొదట నుండియు నీవు దామోదరుఁడవె
చిత్రచిత్రప్రభావ, దాక్షిణ్యభావ,
హతవిమతజీవ, శ్రీకాకుళాంధ్రదేవ.

దీనికి ఇలపావులూరి సుబ్బారావుగారు వైద్యవిద్యకు అన్వయించి పేరడీ రాశారు నవ్వులు-నవ్వులు(పుట.41)లో చూడండి.

చెవుల స్టెతస్కోపు చెప్పి గుండియ బీటు హార్టు స్పెషలిష్టనునాఖ్యదెచ్చె
జ్వరమాని దేహాన వరలు నుష్ణతఁదెల్పి ఫీవర్ల వైద్యుడన్ పేరుదెచ్చె
బీపీని తెలియ జెప్పెడి సాధనము నీకు రక్తపోటెఱిగెడి శక్తినిచ్చె
ఎక్సురే విరిగిన యెముకలు చూపింప బోన్సు స్పెషలిష్టుగా పొగడబడితి
వంతె యిసుమంత యెఱుగవు సుంతయేని
అన్యులెవరును చదువంగ నలవికాని
లిపిని దివ్యౌషధముల పేర్లెల్ల వ్రాసి
వ్యాధి కుదిరింతు వయ్యయో వైద్యవిద్య

+++++49

ఇది శ్రీనాథుని భీమఖండము ద్వితీయ ఆశ్వాసంలోనిది.

వ్యాసుడు కాశీనుండి బహిష్కరింపబడి ద్రాక్షారామానికి వచ్చే మార్గమధ్యంలో అగస్త్యుడు వ్యాసుని కాశీని ఎందుకు వదలివచ్చావు? ఎవరేమైనా అన్నారా? అని అడిగే పద్యం ఇది.

లోలార్కునకు నీకు లోలోననేమనిఁబోటు పుట్టదుగదా! మాటమాట
వెనకయ్య శ్రీడుంఠివిఘ్నేశ్వరస్వామి ధిక్కరింపఁడుగదా! తెగువనిన్ను
నాఁకొన్న నిన్ను మధ్యాహ్నకాలంబున నరయకుండదుగదా!యన్నపూర్ణ
నెపమేమియును లేక నీయెడాటమ్మునఁ బాడిదప్పడుగదా! భైరవుండు
ఎట్టు పాసితి మిన్నేటి యిసుకతిప్ప
లెట్టు పాసితి వాస్థలంబేనుకోసు

లెట్టు పాసితి వవిముక్త హట్టభూమి

యెట్టు పాసితి విశ్వేశునిందుధరుని

పై పద్యానికి పేరడీగా ఇలపావులూరి సుబ్బారావుగారు నవ్వులు-నవ్వులు (పుట.46)లో వ్రాసిన పద్యం.

పంచాయతీబోర్డుప్రెసిడెంటుతో నీకు

పోటుపుట్టదుగదా!మాటమాట

మండలాధ్యక్షుని మనసు నొచ్చెడునట్టు

నడుచుకోలేదుగా! నయమువీడి

పరిషత్తు సభ్యుని భజన చేయకనీవు

ఒడి పెట్టలేదుగా! ప్రతిదినంబు

విద్యాకమిటీమాట వినకుండ నేపేని

పనులొనర్పవుకదా! ఘనతకొరకు

బదలి నీకెందుకీరీతి వచ్చె చెపుమ

అనుచు బ్రశ్నించు మిత్రుని కనియెనొజ్జ

ప్రథమ మహిళను తల్లిగా పలుకరింప

ఆగ్రహించుచు నన్ను నీయడవికంపె

+++++50

భర్తృహరి సుభాషితాలను అనువదిస్తూ ఏనుగు లక్ష్మణకవి విద్యను గురించి ఒక చక్కని పద్యం రాశాడు. అది.....

విద్య నిగూఢ గప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్,

విద్య యశస్సు, భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడున్,

విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్,

విద్య నృపాలపూజితము, విద్య నెరుంగనివాడు మర్త్యుడే

దీన్ని దృష్టిలో పెట్టుకొని చివుకుల అప్పయ్యశాస్త్రిగారు ఈ పద్యాన్ని ప్రేమను వర్ణిస్తూ మనోహరమైన ఉత్పలమాలలో రాశాడు చూడండి.

ప్రేమ మనోవికారమగు, ప్రేమ గృహస్థ శుభ ప్రదంబగుస్,
ప్రేమయె సృష్టి మూలమగు, ప్రేమయె పోషణ ముఖ్య హేతువౌ,
ప్రేమ వినాశకరంబగును, ప్రేమయె ధర్మ నిదాన మయ్యెడిస్,
ప్రేమ సర్వవశ్యమగు, ప్రేమను మించిన లాతి ఉన్నదే

+++++51

శ్రీనాథకవిసార్వభౌముడు ఒకసారి ఒక సుందరాంగిని
చూచి చెప్పిన పద్యం ఇది -
చక్కని నీ ముఖ చంద్రబింబమునుకు కళ్యాణమస్తు! బంగరు బొమ్మ!
నిద్దంపు నీ చెక్కుటద్దంపు రేకకు నైశ్వర్యమస్తు! నెయ్యంపు దీవి!
మీటిన పగులు నీ మెరుగు పాలిండ్లకు సౌభాగ్యమస్తు! భద్రె భయాన!
వలపులు గులుకు నీ వాలు గన్నులకు న త్యధిక భోగోస్తు! పద్మాయతాక్షి!
మధురిమము లొల్కు నీ ముద్దు మాటలకును
వైభవోన్నతిరస్తు! లావణ్యసీమ!
వన్నె చిన్నెలు గల్గునీ మన్ననలకు
శాశ్వత స్థిరస్తు! యోషాలలామ!

ఈ పద్యానికి వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామం (214)లో వ్యంగ్యానుకరణ కనిపిస్తుంది. ఇక్కడ వితంతువులను మంచన దీవించినట్లు చెప్పబడింది.

చెలఁగి చెలఁగి పొత్తి చీరలు గట్టెడు
మాచకమ్మకు దీర్ఘమాయురస్తు!
సారె సారెకు దేవసదనంబునకు నేఁగు
చెడిపెకు సంకల్ప సిద్ధిరస్తు!

నిత్యంబు వ్యభిచార నిష్ఠతో నుండెడు

విధవకుఁ బుత్రాభివృద్ధిరస్తు!

దళముగాఁ దులసి పేరులు ధరియించినయట్టి

విశ్వస్త కారోగ్య విభవమస్తు!

మిండ ముండకు సంపత్సమృద్ధిరస్తు!

పఱచు తెంపికి నిత్య సౌభాగ్యమస్తు!

వదరుఁ గల్కికి నీప్సితావాప్తిరస్తు!

బలు వితంతుకు మైథున ప్రాప్తిరస్తు!

+++++52

విద్వత్ప్రభువైన **అనవేమారెడ్డి**ని సంవత్సరానికొకసారి **నాచనసోమనాథకవి** దర్శించేవారట. దర్శించి ఒక పద్యం చెప్పి సన్మానం అందుకొనేవాడట. ప్రతిరోజు ఆయనదగ్గరుండే కవులకు ఇది కన్నెర్రైంది. దీనితో రాజునకు లేనిపోని కొండేలు చెప్పారు. విని విని ఒకసారి రాజుగారు సోమనకు కబురు పెట్టారు. అప్పటికి 8 నెలలైంది. సోముడు రాజాజ్ఞప్రకారం వచ్చి తన కవితా ప్రాభవాన్ని ప్రదర్శిస్తూ ఒక కందంలో కొంతభాగం చెప్పి మిగతా భాగాన్ని అక్కడి కవులను పూరించమని, నాలుగునెలల తరువాత తాను విజయదశమినాడు మిగతా భాగాన్ని పూరిస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ పద్యం-

కొంచెపు జగముల లోపల

సంచితముగ నీదు కీర్తి అనవేమనృపా

మించెను..........

అనవేముడు తమ గొప్పలు చెప్పుకున్న కవులను పూరించమని అడిగితే వారు చేయలేక పోయారట. చేయలేకపోయారు

అనటంకంటె వారుచేసినవి రాజుకు నచ్చలేదు అనవచ్చు. విజయదశమి రానే వచ్చింది. సోమన వచ్చాడు పూరించాడు ఆ పూరణ-

కొంచెపు జగముల లోపల

సంచితముగ నీదు కీర్తి అనవేమనృపా

మించెను కరి ముకురంబున

పంచాక్షరి శివుడు హరిఁబ్రపంచము వోలెన్

(ఓ అనవేమనృపాలా! అద్దంలో ఏనుగు ఉన్నట్లుగా, పంచాక్షరి మంత్రంలో శివుడు ఉన్నట్లుగా విష్ణువు ప్రపంచమంతా ఉన్నట్లుగా ఈ కొంచెపు లోకంలో నీ కీర్తి మించింది.)

+++++53

పంచేంద్రియాలకు, మనస్సనే ఆరో ఇంద్రియానికి విషయభూతమైన పదార్థాలన్నీ ఒక్క లలనామణిలోనే లోకోత్తరమైన రీతిలో పొదగబడి ఉన్నాయి- అనే ఈ శ్లోకం చూడండి.

ద్రష్టవ్యేషు కిమ్ముత్తమం? మృగదృశ ప్రేమప్రసన్నం ముఖం;

ఘ్రాతవ్యేష్వపి కి? తదాస్యపవన: శ్రావ్యేషు కిం? తద్వచ:

కిం స్వాద్యేషు? తదోష్టవల్ల వరస:; స్పృశ్యేషు కిం? తద్వపు;

ధ్యేయం కిం? నవయౌవనే సహృదయై: సర్వత్ర తద్విభ్రమా:

(భర్తృహరి సుభాషితములు -2-7)

ఈ శ్లోకం ప్రశ్నోత్తరరూపంలో ఉంది.

1. రసికులైనవారు ప్రాయంలో చూడదగింది ఏది ?

- **ముద్దుగుమ్మ మచ్చటైన ముఖం**

(ఇది నేత్రేంద్రియాన్ని తృప్తి పరుస్తుంది.)

2. వాసన చూడదగినదానిలో ఉత్తమమైనది ఏది?

- **ఆ జవరాలి కమ్మని తావి** (ఇది మగద్దరాలి ముఖారవిందాన్ని తాకుతూ వచ్చేగాలి మోసుకొచ్చే గంధం- ఇది నాసికేంద్ి్రయ రూపమైన తృప్తే్తినిస్తుంది.)

3. వినదగిన వాటిలో శ్రేష్ఠమైనది ఏది?

- **నునులేత తరుణీమణి యొక్క భాషణ**

(దీనివల్ల శ్రోత్రేంద్రియ విషయ సౌఖ్యతృప్తిని సూచిస్తుంది.)

4. పానము చేయదగిన వాటిలో ఉత్తమమైనది ఏది?

- **స్త్రీ యొక్క అధరామృతం** (ఇది జిహ్వేంద్రియ తృప్తి సూచకం)

5. తాకదగిన వాటిలో మేలైనది ఏది?

- **లలన యొక్క నును మెత్తని మేను**

(పుష్పంలా సుకుమారమైన శరీరంగల స్త్రీ సంభోగం.

ఇది పంచేంద్రియాలకు సుఖాన్నివ్వగలది.)

6. అంతరేంద్రియమైన మనస్సుకు సౌఖ్యం కలిగించేది ఏది?

- **స్త్రీని గూర్చిన తలపే**

+++++54

ఒకమారు పీఠాపురం రాజావారి దివాణంలో ప్రభు సమక్షంలో తుమురాడ సంగమేశ్వరశాస్త్రిగారి వీణకచ్చేరి జరిగింది. వచ్చిన శ్రోతల్లో పానుగంటివారు ఒకరట. వీణాగానం తర్వాత సంగమేశ్వర శాస్త్రిగారిని అభినందస్తున్న మహారాజును ప్రశంసిస్తూ పానుగంటివారు చెప్పిన పద్యం ఇది.

స్వజనుల నేరీతిఁబరిపాలన మొనర్తు నాశ్రితు నెవ్వాని నాదరింతు

వాదాయమున నెంత యర్థుల కిచ్చెద వెదెటు చేసిన భృత్యు నెదగణింతు

నవని పాలన నేది యార్జించినాఁడవు కవితగానంబు నేపగిది విందు

వెట్లుగాఁబృథు సౌఖ్య మీక్షింపఁగా నుంటి వాత్మ సంస్తుతుల కేమందు వయ్య

సరిగ, ధని, సగమ పనిని సరిగ, గరిమ

మరిమరిగ, పాపనినిగని, సరిసర యను

వీణకాని "మా" వెన్క "నీ" వీణ వరుస

మీఁద "నీ" వెన్క "మా" సూర్యమేదినీశ

సీసపద్యంలోని ఎనిమిది ప్రశ్నలకు ఎత్తుగీతిలో వీణా స్వరవిన్యాసంతో జవాబులిచ్చారు.

1.ప్ర- స్వజనుల నేరీతిఁబరిపాలన మొనర్తు - సరిగ

2.ప్ర- నాశ్రితునెవ్వాని నాచరింతువు - ధని

3.ప్ర- ఆదాయమున నెంత యర్థుల కిచ్చెదవు - సగమ

4.ప్ర- ఎదెటు చేసిన భృత్యు నెదగణింతువా - పనిని సరిగ

5.ప్ర- అవని పాలన నేది యార్జించినాఁడవు - గరిమ

6.ప్ర- కవితగానంబు నేపగిది విందువు - మరిమరిగ

7.ప్ర- ఎట్లుగాఁబృథు సౌఖ్య మీక్షింపఁగా నుంటివి - పాపనినిగని

8.ప్ర- ఆత్మ సంస్తుతులకేమందు వయ్య - సరిసరి

అని ప్రశ్నలకు జవాబులు ఉన్నాయి.

ఇంకా చమత్కార మేమంటే "ఓ మహారాజా! ఈ వీణ వరుసమీద ఆరోహణావరోహణ క్రమంలో "మా వెన్కనీ" అంటున్నది. కాని "నీ వెన్క" "మా" అన్నది ఉంటుంది. "మా" అంటే లక్ష్మి. నీ వెనుక లక్ష్మిగాని, లక్ష్మి వెనుక నీవు ఉండవు అని భావం.

+++++55

తెలుగులో భృంగ పంచకం పేరుతో ఐదు పద్యాలున్నాయి. ఇవి ఎవరు రాశారో తెలీదుగానీ, శ్రీనాథుడని కొందరి అభిప్రాయం. ఈ ఐదు పద్యాల చుట్టూ మాంచి కత కూడా అల్లిపెట్టారు మన పూర్వులు. కథలో కెళితే.....

పూర్వం ఒక మహారాజుకు సౌందర్యవతి అయిన భార్య ఉండేది. రాజులకు అనేక మంది భార్యలు ఉండటం సహజం వారిలో ఈవిడ చిన్నదిగా అనుకోవచ్చు. మహారాజు వల్ల పూర్తి చెందక మదనజ్వరంతో వేగిపోతోంది. ఆ రాజ్యంలో మంత్రి ముసలివాడు కావడంతో, అతని కుమారుని ఆపదవిలోకి నియమించాడు రాజు. కొత్తమంత్రి మంత్రాంగనిపుణుడేకాదు అసాధారణ సౌందర్యవంతుడు. రాణిగారి కన్ను ఇతనిపైబడింది. చాతుర్యధుర్యయైన చేటికచేత రాయబారాలు నడిపింది. అతడేమి తక్కువవాడా! వచ్చిన అవకాశాన్ని వదులుకొనే అరసికుడా! వచ్చిన చిక్కల్లా ఆమెతో సంగమం ప్రమాదకరం కావున జాగ్రత్తగా వ్యవహరించాలి. "కామాతుకాణాం నభయం నలజ్జ" అనికదా! కామాతురత భయాన్ని దాటి పురికొల్పింది. చీకటి పడిన తరువాత రాణిదూతిక ఏర్పరచిన సంకేతాన్ని అనుసరించి, ఆమె భవనానికి చేరుకున్నాడు. మదనక్రీడా పారవశ్యంలో వారికి సమయం తెలియలేదు.

ఇంతలో మహారాజు నెమ్మదిగా తన భవనం నుంచి బయలుదేరి ఇక్కడికి వస్తున్నాడు. ఆరోజు సప్తమో? అష్టమో? చంద్రుడుకూడా ఆలస్యంగా ఉదయించాడు. ఈ పరిస్థితి చూచిన చెలికత్తె తుమ్మెదపై పెట్టి అన్యాపదేశంగా మంత్రిని హెచ్చరించింది.

మాయురె భృంగమా! వికచమల్లికలస్ విడనాడి తమ్మిలో

నీయెడ పూవుదేనియల నింపు జనింపగ గ్రోలి సౌక్కియుస్

బోయెదనన్న భ్రాంతి నిను బొందదు రాజుదయించె నిప్పుడే

తోయజపత్రముల్ వరుసతో ముకుళించె జలింపకుండుమా!

(ఈ పద్యం పైకి కనిపించే భావం - ఓ తుమ్మెదా మంచి మల్లెలను విడచి తామరపువ్వులోని మకరందం మీదమోజుతో ఇక్కడ చేరావు. ఎంసేపటికీ విడిచిపెట్టి వెళ్ళిపోదామని అనుకోవడంలేదు. చంద్రుడు ఉదయించినాడు. తామరరేకులు ముడుచుకుంటున్నవి. ఇప్పుడు బయటికి పోలేవు. కదవిక లేకుండా జాగ్రత్తగా ఉండు. దీనిలోని ధ్వని(ఆంతర్యం)- ఓ మంత్రిశేఖరా నీ భార్యను విడిచి, రాణితో క్రీడిస్తూ ఆలస్యం చేశావు. ప్రభువు వస్తున్నాడు. (రాజు - ప్రభువు, చంద్రుడు). అయినా భయపడక దాక్కో.) లోపల ఉన్న ఇద్దరూ ఈ హెచ్చరికతో జాగ్రత్తపడ్డారు. ఈ పద్యం విన్న మహారాజుగారు చెలికత్తెను ప్రశ్నించగా. ఆమె తామరలను చూచి చెప్పానని చమత్కరించింది. మంత్రి దాగినచోటు ఇరుకు, గాలి లేదు. బాధతో అటూ ఇటూ కదులుతున్నాడు. మహారాజు ఆ సంగతి కనిపెడితే ప్రమాదమని చెలికత్తె చతురిక మళ్ళీ ఇలా హెచ్చరించింది.

అలికులవర్య! పద్మముకులాంతమందు వసింప నేరమిన్

జలనము సెందె దేమి నవసారసమిత్రుడు రాకయుండునా

తొలగక యందె యుండు మిక తోయజవైరి తిరంబె రాత్రి యీ

కలవర మేల తుమ్మిదను గానక యూరట యురకుండుమా!

(తుమ్మెదా! ముకుళితమైన తామరలో ఉండలేక కదులుతున్నావెందుకు! ఈ చంద్రుడు స్థిరమా? సూర్యుడు రాకుండా ఉంటాడా? కలవరపడక ఊరటతో ఊరుకో. మంత్రి పరంగా- ఓ మంత్రివరా! నీవు దాక్కొన్న ఇరుకు ప్రదేశంలో ఇబ్బందిగా ఉండవచ్చు స్థిరంగా ఉండు ఆయన వెళ్ళిన తరువాత ఒంటరి సమయం వస్తుంది. అప్పటిదాకా సద్దుచేయక జాగ్రత్తగా ఉండాలి.)

ఆ మాటలు విని మంత్రి ధైర్యంతో, ఓర్పుతోవేచి ఉన్నాడు. అతని ఇంటి దగ్గర ధర్మపత్ని ఇతని గురించి ఆందోళన చెంది, రహస్యంగా వాకబు చేసింది. భర్త వ్యవహారాలు ఆమెకు కొంత తెలుసు. రాణిగారి ఇంటికి వెళ్ళాడని తెలిసి, అక్కడ ఏమి ప్రమాదం వచ్చిందో అని ఆదుర్దాగా బయలుదేరి వచ్చింది. ఆమె వచ్చి బయటపడి విచారణ చేస్తే గుట్టు రట్టవుతుందని చతురిక ఆమెకు ఇలా చెప్పింది.

అలినీ తత్తరమేల నేడు నిదె నీ యాత్మేశుడౌ భృంగముస్

జలజాసక్త మకరంద పానవశతస్ సానందుడై యున్న వా

డులు కింతేనియు లేక నీ వరుగుమీ యొప్పారు నిప్పాట నీ

చెలువుండుం బరతెంచు వేకువను రాజీవంబు పుష్పించినస్

(ఆడు తుమ్మెదా నీ భర్త పద్మినీ మకరందపాన వివశుడై ఉన్నాడు.

ఆనందంలో మునిగి ఉన్నాడు. నీవు భయపడవద్దు. తెల్లవారి రాజీవం విచ్చుకోగానే, నీ నాథుడు వస్తాడు. ప్రస్తుతానికి నెమ్మదిగా వెళ్ళిపో.)

మంత్రి భార్యకు జరిగింది అర్థమై వెళ్ళిపోయింది. రాజు రాణితో మదనకేళిలో తేలి, అలసి నిద్రించాడు. రాణికూడా ఆ స్థితికే వెళ్ళింది. తెల్లవార వచ్చింది. ఇక దాక్కున్న మంత్రి వెళ్ళిపోవటానికి అవకాశం వచ్చిందని చతురిక మంత్రికి అర్థమయ్యేలా ఈ విధంగా అన్నది.

పతి నిద్రించిన వేళ రా దగునయో పద్మారి! యీ కేళికా

యతనంబందు రతిశ్రమ న్విభుడు నిద్రాసక్తుడై యుండె నీ

శత పత్రేక్షణ మోము వాంచినది నీసామర్థ్యముం జూపదో

కతి వేగంబుగ నేగుమా తొలగి మాయాత్మల్ సుఖం బందగస్

ఈ పద్యభావాన్ని గ్రహించిన, మంత్రి జాగ్రత్తగా ఇవతలకు వచ్చి వేగంగా వెళ్ళిపోయాడు. మరునాటి ఉదయం అవసరమైన రాచకార్యాలు ఉండటంవల్ల విశ్రాంతి తీసుకోకుండానే హడావిడిగా మంత్రి కొలువుకూటానికి వెళ్ళాడు. మహారాజు పేరోలగంలో ఉన్నాడు. పైనున్న

తెరల చాటున నుంచి రాణి చూస్తూంది. కొలువుకు వచ్చే తొందరలో మంత్రి ముందురోజు రాత్రి ప్రేమావేశంలో రాణి తన మెడలో వేసిన పచ్చల హారాన్ని తీసి దాచకుండా అలాగే వచ్చాడు. దాన్ని రాజు చూస్తే గుర్తుపడతాడు. ప్రమాదం. రాణి కలతచెంది ఈ అపాయాన్ని ఎలాగైనా

తొలగించమని చెలికత్తెను కోరింది. చతుర అయిన చతురిక మారువేషంతో ఒక భట్టువలె వచ్చి, ఆస్థానమంతా కలయజూచి ఈ పద్యం చదివింది.

అతుల సంభ్రాంతరస్థిత బుధవళి కెల్ల జోహారు, వీరరా

హతులకు మేల్జోహారు, సతతోజ్జ్వల విక్రమ సార్వభౌమ సం

తతికి జోహారు, వైభవవితాన పురందరుడైన యట్టి భూ

పతికి జోహారు, మానపరిపాల జోహారు ప్రధాని శేఖరా!

అందరినీ స్తోత్రం చేసినట్లు కనిపించినా తనను ప్రత్యేకంగా మానపరిపాల అనటం

మంత్రికి పట్టిచ్చినట్లుగా ఉంది. భట్టును చూసి చతురిక అని గ్రహించి, తనను

చూసుకొని, తడుముకొని, పచ్చల హారాన్ని గురించి తెలుసుకొని, మెడలో నుంచి ఇతర హారాలతో

దాన్నీ కలిపి బయటకు కనబడకుండా తీసి, కవిత్వానికి సంతోషించి ఇస్తున్నట్లుగా కుహనాభట్టుకు

బహూకరించాడు. మిగతావారు, రాజు ఏవో బహుమతులిచ్చి పంపారు.

ఈ ఐదు పద్యాలలో ఇమిడిన అందమైన కథ ఇది.

+++++56

కూచిమంచి తిమ్మకవి రచించిన **రసికజనమనోరంజనం** చదివిన

ఒక వేశ్య ఒకానొకరోజు తిమ్మకవి ఆదారి వెంబడి పోతూ ఉండగా చూచి

పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆయన్ను వాటేసుకుందట దానితో ఏమీ అర్థంకాని ఆయన మొగం పక్కకు

తిప్పుకున్నాడట. దానికి ఆవేశ్య ఇలా అన్నది.

"చతురులలోన నీవు కడు జాణవటంచును నెంచి కౌగిలిం

చితి నిటు మారుమోమిడగ చెల్లునె యో రసికాగ్రగణ్య?" - అన్నదట.

దానికి తిమ్మకవిగారు ఈ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చారు.

"అ

ద్భుతమగునట్టి బంగరపు బొంగరపుంగవబోలు నీ కుచ

ద్వితయము టొమ్మునాటి అల వీపున దూసెనటంచు చూచితిన్" - అని అన్నాడట.

+++++57

కవి కలం ఎట్టైనా పలుకుతుంది అనేదానికి ఇక్కడ ఒక సంఘటన చూద్దాం.

అడిదము(కత్తి)సూరకవికి విజయనగర ప్రభువు పెద విజయ రామరాజుకు అంతగా పడేదికాదని

ప్రతీతి. రాజేమో అహంకారి అది వారికి సహజం సూరనేమో కుర్రవాడు ఒకసారి తురక సరదారు

దండయాత్రకు వస్తే సూరకవి ఏమన్నాడో చూడండి.

మెత్తనైనట్టి అరటాకు మీదగాక

మంటమీదను చెల్లునే ముంటివాడి

బీదలైనట్టి సరదార్ల మీద గాక

కలదె క్రొవ్వాడి బాదుల్లాఖాను మీద

(ముల్లుకు అరిటాకు మీద చెల్లినట్లుగా మంటమీద చెల్లుతుందా? కాలిపోదూ. అలాగే రాజుగారి జులుం కింది సరదార్లమీదనేకాని,

నవాబుగారి సేనాపతి బాదుల్లాఖాను మీద చెల్లుతుందా - అని భావం.)

అయితే ఆ దండయాత్రలో రాజుగారు గెలిచారు.

అప్పుడు మళ్ళీ రాజుగారిని ప్రశంసిస్తూ ఈ పద్యం చెప్పాడట.

ఢిల్లీ లోపల గోలకొండపురి నిండెన్ నీ ప్రశంసల్ గులాల్

బల్లాలం బొడిపించి హుమ్మని అరబ్బా నెక్కి పైకొంచు బా

దుల్లాఖానుని బారద్రోలితివి నీ దోశ్శక్తి సూ బాలకున్

మళ్ళింపం దరమౌనె శ్రీ విజయరామా! మండలాధీశ్వరా!

చూడండి అట్లైనా ఇట్లైనా ఎట్లైనా చెప్పగలవాడు, మెప్పించగలవాడు అడిదము సూరకవి.

సూరకవేకాదు ప్రతిభావంతుడైన కవి ఎవరైనా

ఇలాగే చేయగలరు. అందుకే కవి ఎట్లైనా అంటే రెండు వైపులా పదునే.

+++++58

1925 ప్రాంతంలో బెజవాడలో పిసుపాటి చిదంబరశాస్త్రిగారు

శతావధానం చేస్తుండగా ఒక పృచ్ఛకుడు ఎవరికీ దిక్కుతోచని సమస్యను ఇచ్చాడు. దీనితో సదస్యులు దిగ్భ్రాంతి చెందారు.

సమస్య ఇది- **కాఖాగాఘాకిజ కాటన్నాయాటాజ**

చిదంబరశాస్త్రిగారు చిరునవ్వుతో వ్రాసుకోండి అన్నారు.

అర్థరహితమైన ఈ సమస్యను ఎలా పూరిస్తారా? అని అందరూ

ఆశ్చర్యంతో చూస్తున్నారు. శాస్త్రిగారు ఇలా పూరించారు.

చాఛాజాఝాచి జ చంచన్నాయా ఛీజ

తాథాదాధాతిజ తాతన్నాయా థూజ

పాఫాబాభాపిజ పాపన్నాయా పీజ

ఇది వినేసరికి పృచ్ఛకుడు బిత్తరపోయాడు.

కాస్తలో తేరుకొని "పూరణకేమైనా అర్థముందా?" అని ప్రశ్నించాడు.

"మీ సమస్యకు అర్థం ఉంటే మా పూరణకు అర్థం ఉంటుంది"- అన్నారు శాస్త్రిగారు.

అప్పుడు సమస్యార్థాన్ని పృచ్ఛకుడు ఇలా వివరించాడు.

కాటన్నాయడనే ఒక ధనికుడు ఉండేవాడు. అతనికి చదువు అబ్బలేదు. కానీ తాను గొప్పవాడినని పొగిడించుకోవాలని తపన. అలా పొగిడించుకొని వారికి తృణమో పణమో ఇచ్చేవాడు. మిగతా వారికి పైసా కూడా విదిల్చేవాడు కాదు. ఈ రహస్యం తెలుసుకొన్న ఒక చతుర పండితుడు అతని దగ్గరికి వెళ్ళి తాళం వేస్తూ ఈ సమస్యను గానం చేసి గొప్ప సత్కారం పొందాడు.

అప్పుడు శాస్త్రిగారు "ఈ విశాల విశ్వంలో మీ కాటన్నాయని వంటివారు
చంచన్నాయుడు, తాతన్నాయుడు, పాపన్నాయుడు అనే లుబ్ధాగ్రేసర
చక్రవర్తులు ఉన్నారు. మీ పండితుని కన్నా మా పండితులు అధిక
విద్యాప్రౌఢులు కనుకనే అన్యాపదేశంగా ఛీ, థూ - అని వారి మూర్ఖతను
నిందిస్తూనే పొగిడినట్టుల భాసింప చేసి గౌరవం పొందారు." అని వివరించేసరికి సభ్యులంతా కరతాళ ధ్వనులతో పిసుపాటివారిని అభినందిచారు. పృచ్ఛకుడు కూడా తనదారంటే వచ్చిన శాస్త్రిగారి చాతుర్యానికి కాదనలేక హృదయపూర్వకంగా సంతృప్తిని, సంతోషాన్నీ వ్యక్తపరిచాడట.

+++++59

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానానికి ఒకమారు వేశ్య(కవయిత్రి) వచ్చి
అష్టదిగ్గజకవులకు సవాలుగా ఒక సమస్యను ఇచ్చింది.

"మీరును మీరు మీరు మఱి మీరును మీరును మీరలందఱున్" - అనేది సమస్య. ఆ సమస్యను మరుసటి రోజుకు చెప్పేవిధంగా సమయమిచ్చింది. దీనికి సమాధానం ఎలాగా అని ఆలోచించి తెనాలి రామకృష్ణుని ఆశ్రయించినారు. దానికి అతడు పెద్దనతో

"రేపు బోగంది వచ్చి సమస్య అడిగినంతలో మా శిష్యుడు
అని మీరు చెప్పగా నేను మీ శిష్యుడనై చెబుతాను" - అని అన్నాడు.

కచేరి ప్రారంభమైంది పెద్దన తన శిష్యుడు చెబుతాడని చెప్పాడు.

తెనాలిరామకృష్ణుడు లేచి పద్యాన్ని ఈ విధంగా పూరించాడు.

"కోరిక లుప్పతిల్ల మదిఁగోరిన యట్టి కళా విశేషముల్

చారు తరంబులన్ రతుల సల్పఁగ నేర్చిన యట్టి జాణ యీ

వార వధూ శిరోమణి వంతుల వేసుక దెబ్బ తీయుఁడీ

మీరును మీరు మీరు మఱి మీరును మీరును మీరలందఱున్"

దీనితో అష్టదిగ్గజ కవులు ఆనందించగా సభ అంతా కరతాళధ్వనులతో వెల్లివిరిసింది.

+++++60

పూర్వం నెల్లూరు మండలంలో ఉన్న తెట్టు గ్రామ నివాసి మోచర్ల వెంకన.

వెంకటగిరి సంస్థానంలో యాచభూపతి ఇచ్చిన అనేక సమస్యలకు

పూరణ చేసిన గొప్ప ఆశుకవితా ధురీణుడు. ఆ రాజుగారు ఇచ్చిన

సమస్యలలో ఈ సమస్య ఒకటి-

"నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్"

దీన్ని రామాయణ, భాగవత, భారతార్థాలలో పూరించమన్నాడు రాజుగారు.

వెంకన్నగారు ఈ విధంగా పూరించారు.

రామాయణార్థం వచ్చేలా పూరణ -

అనిలజ! జాంబవంత! కమలాప్త తనూభవ! వాయుపుత్ర! యో

పనస సుషేణ! నీల! నల! భానుకులుండగు రాఘవేంద్రుఁడ

ద్దనుజపురంబు వేగెలువ దైత్యులఁజంపగ వేగ రమ్మనెన్

నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్

కిష్కింధలో ఉన్న వానర ప్రముఖులను పేరు పేరున రామచంద్రుడు

రాక్షసులతో వెంటనే యుద్ధం చేసి వారిని సంహరిచడానికి

నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్

రమ్మన్నాడని భావం వచ్చే విధంగా పూరించాడు.

భాగవతార్థం వచ్చేలా పూరణ -

అనఘ సురేశ! వాయుసఖ! అర్యమనందన! రాక్షసేంద్ర! యో

వననిధినాథ! గంధవహా! వైశ్రవణా! నిటలాక్ష! తాను ర

మ్మను మని చెప్పె మాధవుఁడుమారుని పెండ్లికి మిమ్ము నందరన్

నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్

ప్రద్యుమ్నుని పెండ్లికి ఇంద్రుని, అగ్నిని మొదలైన దేవతల నందరిని పేరుపేరున నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్ రమ్మన్నాడు కృష్ణుడు అనే భావం వచ్చేలా పూరించాడు.

భారతార్థం వచ్చేలా పూరణ -

అనఘ సురాపగాతనయ! యర్కతనూజ! విచిత్రవీర్యనం
దన! గురుపుత్ర! ద్రోణ! కృప! నాగపురీశ్వర! దుస్ససేన! ర
మ్మనె రాజసూయము యమాత్మజుఁడిప్పుడుచేయఁబూని తా
నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్

ధర్మరాజు రాజసూయానికి భీష్ముని, కర్ణుని, ధృతరాష్ట్రుని, అశ్వత్థామ, ద్రోణ, కృపాచార్య మొదలైన వారినందరిని ధర్మరాజు రాజసూయానికి పేరుపేరున నిను నిను నిన్ను నిన్ను మఱి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్ అని అందరిని పిలువమని చెప్పినట్లు భావం వచ్చేలా పూరించాడు.

దీన్ని బట్టి మోచర్ల వెంకనకవికి ఎంతటి సమయస్ఫూర్తో! ఎంతటి ఆశుధారయో!

++++61

కుమారధూర్జటి కృత **ఇందుమతీ పరిణయము** లోని పద్యం ఇది

ఒక చెలికత్తె తమ రాజకుమార్తె విరహవేదన చూడలేక కోపంతో

మన్మథుని శపిస్తున్న పద్యం ఇది-

నీ బాణంబులు రాల, నీ ధనువు ఖండీభూతమై పోవ, నీ
జాబిల్లిన్ ఫణియంట, నీ బలము లాశావీధి పాలైచనన్
నీ బంట్రోతు తనంబు స్త్రీల యెడనే, నిన్నెవ్వరున్ నవ్వరే
మా బాలామణి వేచబోకు మకటా మర్యాద గా దాత్మజా

నీ బాణాలు రాలిపోనూ, నీ విల్లు ముక్కలైపోనూ, నీ చంద్రుణ్ని పాముకాటేయ, నీ బలగాలు దిక్కులపాలుగానూ, నీ పౌరుషం ఆడవాళ్ల విషయంలోనేనా? ఎవ్వరూ నిన్ను చూచి నవ్వరా! మా బాలామణిని బాధించబోకు ఓ మన్మథా!ఇది నీకు మర్యాద కాదు సుమా ! - అని భావం

ఇందులో కవి ఎంత చమత్కారంగా మన్మథుని తిట్టిచాడో చూడండి-

మన్మథుని బాణాలు పూవులు అవి రాలిపోతాయికదా ఆమె అదే తిట్టింది.

మన్మథుని విల్లు చెఱకు కదా అది ముక్కలుగా నరుకుతారు కదా

ఆమె అదే తిట్టింది. చంద్రుణ్ణి పాము మ్రింగుతుందికదా ఆమె అదే తిట్టింది

అతని బలగాలు కోకిలా తుమ్మెదలేగా అవి దిక్కుల పారిపోతాయికదా

ఆమె అదే తిట్టింది.

ఇందులో లోకంలో సహజంగా ఉండే వాటినే

తిట్లుగా పలికించాడు ఈ కుమారధూర్జటి.

+++++62

యాచించటంలోని దైన్యము వర్ణించే పద్యం ఇది

మానిసి కేడు జానల ప్రమాణము దేహము, యాచనార్థమై

పూనిన ఆఱు జానలగు, పోయి ధనాఢ్యుని యిల్లు చేరగా

జానలు నాలుగౌ, నతని చల్లగ "దేహి" యటన్న రెండగున్,

పైన నతండు "నాస్తి" యనినన్ వినినంతన శూన్యమయ్యె డిన్!

మనుష్యుని దేహము 7 జానల పొడవుంటుంది. యాచించుటకు

సిద్ధపడగానే (అడుక్కోవడానికి)6 జానలవుతుంది. ధనవంతుని యిల్లు చేరగానే 4 జానలవుతుంది. అతనిని అని అర్థించగానే "దేహి"2 జానలవుతుంది. ధనాఢ్యుడు "నాస్తి" అనంటే అర్థించిన వ్యక్తి శూన్యమై (అభిమానవంతుడు)పోతుంది.

+++++63

మాట అంటే పదము, వాక్యం, వార్త, సూక్తి, లోకోక్తి, ప్రతిజ్ఞ, కథ, ప్రార్థన ఇలా అనేక అర్థాలున్నాయి.

ఈ పద్యం చూడండి మాటను ఎంత గొప్పగా చూపించాడో.

మాటలచేత దేవతలు మన్ననచేసి వరంబులిచ్చెదర్

మాటలచేత భూపతులు మన్ననచేసి ధనంబు లిచ్చెదర్

మాటలచేత కామినులు మగ్నతచెంది సుఖంబు లిచ్చెదర్

మాటలు నేర్వకున్న అవమానము, న్యూనము, మానభంగ మున్

కాబట్టి మంచి మాటలు నేర్చి, అర్థం చేసికొని, చక్కగా వివరించడం కూడా అభ్యాసం చేయాలి. లేకుంటే అగౌరవం, హీనత్వం, గర్వభంగం మొదలైనవి ఎన్నో గలుగుతాయి. కావున ప్రతి మనిషి సమయానికి తగిన విధంగా మాట్లాడవలెనని కవి హెచ్చరికగా దీన్ని భావించవచ్చు.

+++++64

ఒక అభిసారికను ఆమె చెలికత్తె "నీకు అందమైన భర్త - సమర్థుడు ఉండగా వ్యభిచారమేల?" - అని ప్రశ్నించిందట. దానికి ఆమె సమాధానం చూడండి.

ఆకారే శశీ, గిరా పరభృత:, పారావతశ్చుంబనే

హంసశ్చంక్రమణే సమం దయితయా, రత్యాం ప్రమత్తో గజ:

ఇత్థం భర్తరిమే సమస్త యువతి శ్లాఘ్యై: గుణై: శోభతే

శూన్యం నాస్తి వివాహిత: పతిరివ స్యాన్నైక దోషోయది!

నా భర్త ఆకారంలో చంద్రుడు, మాటలలో కోకిల, ముద్దుమాటలలో పావురము, నన్ను కొంగుపట్టుకొని తిరగడంలో రాజహంస, రతిలో మత్తగజమే నా భర్తలో యువతులు మెచ్చుకొనే గుణాలన్నీ ఉన్నాయి.

తాళికట్టినమగడగుటే పెద్దలోపము ఆ ఒక్క లోపం వల్లనే పరపురుషులను అభిసరిస్తున్నాను. - అని చెప్పిందట.

+++++65

పెదపాటి ఎర్రాప్రెగడ రచిత **కుమారనైషధము**లోని దమయంతి సౌందర్యాన్ని వర్ణించు సందర్భములోనిది ఈ పద్యం.....

అలికుల మెల్ల వేణియును హంసములెల్లను మందయానముల్

జలజము లెల్ల నెమ్మొగము జక్కవలెల్లను చన్నుదోయి యా

పులినము లెల్లఁ బెన్పిఱుఁదు పుష్పములెల్లను మేనివాసనల్

పొలఁతుక నాక్రమించుకొనిపోయె నన్నియు నన్నివంకలన్

దమయంతిని - తుమ్మెదలు వేణి(జడను)ని, హంసలు మందయానం (మెల్లని నడక)ను, పద్మాలు మొగమును, జక్కవలు(చకోరపక్షులు) చనుగవను, ఇసుకతిన్నెలు పెద్ద పిరుదులను, పువ్వులు శరీరవాసనను

అన్ని అన్నివైపులా ఆమెను ఆక్రమించేశాయి - అని భావం

+++++66

మద్దుపల్లి వేంకటసుబ్రమణ్యశాస్త్రిగారు తమ కవితావినోదము (సంపుటము-1)లోనిది ఈవిషయం.

కుక్షిని గురించిన ఒక చక్కటి సుభాషితం తమిళంలో అవ్వయ్యార్ అనే భక్తురాలు తను ఒకమారు

అరణ్యంలో పోతూ ఉన్నపుడు ఆకలిగొన్న సమయంలో చెప్పినదటసుభాషితం . ఇది.

ఒరునా ళుణపై యొడి యెండ్రా లొడియాయ్
ఇరునాళై క్కె లెండ్రా లేలాయ్
ఒరునాళు మేన్నో వరియాయ్
ఇడుం బైకూ రేన్ వయిరే
ఉన్నోడు వాడిద లగిదు

దీని భావం- ఒక దినము ఆహారమును విడిచిపెట్టమంటే విడిచిపెట్టవు.

రెండు దినములకు ఆహారం తీసుకోమంటే తీసుకోవు. ఒక్కదినమైనా నా సంకటమును తెలిసికొనవు. సంకటకారిణియైన ఓ కడుపా నీతో జీవనం చేయటం కష్టం.

ఇంత కమ్మని భావం మద్దుపల్లిగారికి తెలిసినంతలో సంస్కృతంలో కనిపించలేదటఅందుకని . వారు తనే కవితావినోదచాపలంచేత 1-9-1947న సంస్కృతీకరించారట. ఆ శ్లోకం ఇది.

హేకుక్షేతవ కిం బ్రవీమి చరితం !? సర్వం విలక్షం, యథా
హ్యేకస్మిన్ జహి వాసరే2న్నమితిచే దేవం నహి త్యక్ష్యసి,
యద్వాప్రాప్తమితి ద్వివాసరమితం భుంక్ష్వేతి వా నో తథా
జానీషే న హి మే శ్రమం వద కథం జీవామి సాకంత్వయా?

+++++67

వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెలుపుడీ - అని

స్వాతంత్ర్యసమరంలో గంధం పట్టుక తిరిగిన మన **కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి**గారి సూతపురాణంలోని పద్యం

ఒకరుడు "వేదమే భగవదుక్త" మటంచు నుపన్యసించు, నిం
కొకరుడు "బైబిలే భగవదుక్త" మటంచును వక్కణించు, వే
రొక్కరుడుమా "ఖొరాన్ భగవదుక్త" మటంచును వాదులాడు, నీ
తికమక లేల బెట్టెదవు? తెల్పగరాదె! నిజంబు నీశ్వరా!

(సూతపురాణము -3-1)

ఈశ్వరా! ఒక ఛాందసుడు వేదాలనే భగవంతుడు అన్ని ధర్మాలను భవ్యంగా వివరించాడు కావున వాటినే సదా సేవించాలంటాడు. మరొకడు బైబిలు గ్రంథమే భవ్యమైనది అదే భగవత్ కైంకర్యంగా

కర్తవ్యమని కంకణం కట్టుకొని బోధిస్తాడు. వేరొకడు అవేవీకావు మా ఖురాన్ గ్రంథమే ఖుద్దున (స్వయంగా) ఖుల్లను(వివరంగా), ఖుషీగా ఖుల్లమము(రాచబాట)ను చూపిస్తుందంటాడు, ఇలా ఇంతమంది ఇన్ని విధాల మా చెవులు గింగిరులెత్తించి, గిజగిజలాడించి, గింజుకొనేట్లు చేస్తుంటే, హే భగవాన్! దేవా! అల్లాహో అక్బర్! ఎందుకిలా ? మమ్ములను తికమక పెట్టి చంపుకు తింటావు. ఓ కరుణామయా! కనికరించి, అసలు నిజమేదో నిగ్గుతేల్చి చెప్పి, మా సందేహాలను పటాపంచలు చేయరాదా? - అని కరుణాక్రందన చేస్తున్నాడు కవిగారు.

+++++68

ఒక కవి వ్యంగగా కస్తూరిని సంబోధిస్తూ చెప్పిన అన్యాపదేశ పద్యం ఇది

పీనస రోగి నిన్ను తిలపిష్ట సమానము చేసినంతనే

వాని వివేక హీనతను వందురనేల కురంగనాభమా

మానవతీకపోలకుచమండలమండిత చిత్రపత్రికా

నూన వితాన వాసనల నుండుట లోకము నిన్నెరుంగదే

(ప్రబంధరత్నాకరము)

కస్తూరి మంచి పరిమళం గల సుగంధద్రవ్యం. పీనసరోగమున్నవాడు వాసనను గ్రహించలేడు కాబట్టి అతని దృష్టిలో తెలకపిండి, కస్తూరి

రెండూ ఒక రకంగానే అనిపిస్తాయి అది వాని అజ్ఞాన ఫలితం.

ఓ కస్తూరీ! నీవు ఆ విషయంలో బాధపడవద్దు. యువతుల చెక్కిళ్ళమీద, స్తనాల మీద కస్తూరితో చిత్రించిన రకరకాల చిత్రాలను వాటినుండి వ్యాపించే సువాసనను ప్రపంచం గుర్తిస్తుంది కదా!

ఇది వ్యంగ్యంగా మరో అర్థాన్ని తెలుపుతుంది-

కవి పండితుల వైదుష్యాన్ని, ప్రతిభను ఒక వివేకి గుర్తించనంత మాత్రాన

వారి గొప్పతనానికి ఏ విధమైన కొరత కలగదు. ప్రపంచం వారి గొప్పదనాన్ని తప్పక గుర్తిస్తుంది - అని భావం.

+++++69

కొంచెం ఛందోజ్ఞానం ఉన్నవాళ్ళంతా కవులమని చెప్పుకొని తిరిగే

నాటిరోజుల్లో శ్రీనాథుడు అన్యాపదేశంగా గాడిదను సంబోధిస్తూ చెప్పిన పద్యం ఇది-

బూడిదబుంగవై యొడలు పోడిమి దప్పి మొగంబువెల్లనై

వాడల వాడలం దిరిగి వచ్చెడి వారలు చొచ్చొచోయనన్

గోడల గొందులందొదిగి కూయుచునుండెడి కొండవీటిలో

గాడిద! నీవునుం గవివి గావుగదా! యనుమానమయ్యెడిన్

ఒంటినిండా బూడిదపూసుకొని, కళతప్పి, ముఖం తెల్లగా పాలిపోయి వీధులన్నీ తిరుగుతూ, ఎదురు వచ్చేవారు చొచ్చో అని అదిలిస్తుండగా

గోడలకు ఒదిగి ఓండ్రపెడుతున్నావు. కొండవీటి పట్టణంలోని ఓ గార్దభమా!

నీవు కూడ కవివి కావు గదా! నాకెందుకో అనుమానంగా ఉందిసుమా అని

శ్రీనాథుడు కవిమ్మన్యులను ఎత్తి పొడిచాడు. కేవలం గణయతి ప్రాసలు తెలిసి పద్యాలు రాసినంతమాత్రాన ఎవరూ కవులుగాదని ఆ కవులకు తెలియజెప్పడానికి గాడిద నుద్దేశించి ఈ పద్యం చెప్పాడు.

+++++70

ఒక కవి ఎంతవారైనా సమయానుకూలంగా ప్రవర్తించాలని **అన్యాపదేశం**గా ఈ శ్లోకం కూర్చారు -

గణేశ స్తౌతి మార్జాలం స్వవాహ సాభిరక్షణే

మహా నపి ప్రసంగేన నీచాస్ సేవితు మిచ్ఛతి

గణపతి పిల్లి స్తుతిస్తున్నాడట- ఎందుకనగా తనవాహనమై ఎలుకను రక్షించుకోవటానికి దానిని స్తుతించకపోతే అది తన వాహనాన్ని ఎక్కడ మ్రింగేస్తుందోనని దాన్ని స్తుతిస్తున్నాడట అంతటి దేవుడు కూడ ఆవిధంగా చేయవలసి వచ్చిందంటే గొప్పవాడు కూడ సందర్భాన్ని బట్టి నీచులను సేవించవలసి వస్తుందని శ్లోకంలో సమర్థించబడింది. కాబట్టి కవికి తటస్థించిన సందర్భం కూడ అలాంటిదేనని అన్యాపదేశంగా కవి చెబుతున్నాడు.

+++++71

విజయనగర ప్రభువు ప్రౌఢ దేవరాయల ఆస్థానంలోని గౌడ డిండిమ భట్టును ఓడించిన తరువాత అతని కంచు ఢక్కను బ్రద్దలు కొట్టించి

కవిసార్వభౌమ బిరుదును పాదుకొలిపి కనకాభిషేకం పొంది పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంనికి తిరిగి వచ్చాడు.

సర్వసింగభూపాలునికి పెదకోమటివేమారెడ్డికి గల వైరం వల్ల పెదకోమటి వేమారెడ్డిచిత్రపటాన్ని సభలో పెట్టికి సర్వసింగభూపాలుడు సభికులచేత అవమానంకరమైన పని చేయిస్తున్నాడని తెలిసిన శ్రీనాథుడు ఆ అకృత్యాన్ని నివారించటానికి సర్వసింగభూపాలుని ఆస్థానానికి వెళ్ళాడట.

ఆ సందర్భంలో శ్రీనాథుడు సింగభూపానికి గురించి ఈ పద్యం చెప్పాడట-

సర్వజ్ఞ నామధేయము

శర్వునకే రావు సింగ జనపాలునకే

యుర్విం జెల్లును తక్కొరు

సర్వజ్ఞుం డనుట కుక్క సామజ మనుటే

సర్వజ్ఞుడనే పేరు శివునికీ, సింభూపాలునికీ మాత్రమే. భూమిపైన చెల్లుతుంది ఇంకెవరినైనా అలా పిలవడం కుక్కను ఏనుగు అనటమే- అని దీని భావం.

దీనితో సింగభూపాలుడు తనను శివునితో సమానుడని స్తుతించడమేకాక భూమి మీద మరెవరు ఇంతవారు లేరన్నందుకు పొంగిపోయి గొప్ప సత్కారం చేసి శ్రీనాథుడు వచ్చిన పనిని నేరవేర్చాడు. ఇది ఇలా ఉంటే వేమారెడ్డికి ఈ వార్త తెలిసి తన శత్రువును శివునితో సమానంగా పొగడటమా అని బాధ పడ్డాడు. శ్రీనాథుడు రాగానే అదికాస్తాఅడిగేశాడు. అప్పుడు శ్రీనాథుడు నవ్వుతూ ఇలా చెప్పాడట- మహారాజా! నేను సింభూపాలుని పొగడలేదు. తెగడిన పద్యం అది.

అర్థం చేసుకోలేని ఆయన స్తోత్రమని భ్రమపడి నాకు సత్కారం చేశాడు

ఇప్పుడు చెప్పండి ఆ పద్యం ఇది-

సర్వజ్ఞ నామధేయము శర్వునికే-

రావుసింజనపాలునకు ఏ యుర్విం జెల్లును

తక్కొరు సర్వజ్ఞుం డనుట కుక్క సామజ మనుటే-

(సర్వజ్ఞ నామము శివునికి మాత్రమే చెల్లుతుంది. సింగభూపాలునికి ఏ భూమి మీద చెల్లుతుంది. తక్కొరు - అంటే శివునికాక ఇతరులను సర్వజ్ఞుడంటే కుక్కను ఏనుగనటమే - అని భావం)

ఇది విన్న వేమారెడ్డిగారు ఎంతో సంతోషించారు.

ఇందులో పదాలవిరుపులతో ఎంత చమత్కారంగా మారింది.

+++++72

వంగతోటనుండు వరిమళ్ళలోనుండు

జొన్నచేలనుండు చోద్యముగను

తలుపుమూలనుండు తలమీఁదనుండును

దీని భావమేమి తిరుమలేశ?

ఈ పద్యం కడు చిత్రమైనది గమనింపుము.

వంగతోటలో నుండేదీ, వరిమళ్ళలోనుండేదీ,

జొన్నచేలలోనుండేదీ, తలుపుమూల నుండేదీ

ఏదో అది దీని సమాధానం.

ఏమిటది ?

- అని ఏంత ఆలోచించినా తెలియనిది. ఏమీలేదు మనభ్రమతప్ప మరేంలేదు. ఇక్కడ విరామం లేకుండా చెప్పడంలో ప్రశ్న పుడుతోంది.

ఇప్పుడు చూడండి.

వంగ తోటనుండును,

వరి మళ్ళలోనుండును

జొన్న చేలనుండును

(చోద్యముగను)

తలుపు మూలనుండును,

తల మీఁదనుండును

ఏముంది మరి ఎక్కడున్నవి అక్కడే ఉన్నాయి. పదాలవిరుపు తప్ప.

+++++73

మనం మామూలుగా భోజనపంక్తి దగ్గర ఎక్కువగా ఈ సామెతను మాడుతుంటాము. తిండికి ముందు పనికి వెనుక ఉండాలి - అని.

ఈ సందర్భంలో ఎక్కువగా వాడటం వల్ల ఇదిసామెతే అనుకుంటున్నాము.

కాని ఇది ఒక పొడుపు కథ. చూడండి.

తిండికి ముందు ఉండేది

పనికి వెనుక ఉండేది

ఏది చెప్పండి?

- అంటే ఆలోచించాల్సిందేగా!

ఆలోచిస్తే తిండికి ముందుండేది - **కుడిచెయ్యి**

అలాగే పనికి వెనుక ఉండేది - అంటే అదీ - కుడిచెయ్యే

ఎట్లాగంటే ఏ పనైనా చేయటానికి చెయ్యి ఎత్తి చేయాలికదా

అప్పుడు చెయ్యి వెనక్కేకదా వెళ్ళేది. అందుకే తిండికి ముందుండేది

పనికి వెనకుండేది ఏది? - సమాధానం - కుడిచెయ్యి

దీన్నే కొందరు తినటానికి ముందు - యుద్ధానికి వెనుక - అని కూడ అంటుంటారు.

+++++74

సంస్కృత తెలుగు భాషల మిశ్రమంతో చెప్పిన మణిప్రవాళ పద్యాలు -

అమర మమర మంటే ఆశకాదా కవీనాం

అశన మశనమంటే ఆశకాదా ద్విజానామ్

అమృత మమృతమంటే ఆశకాదా సురాణాం

అధర మధరమంటే ఆశకాదా విటానామ్

అమరమంటే కవులకు, అశన(భోజన)మంటే బ్రాహ్మణులకు,

అమృతమంటే దేవతలకు, అధరం అంటే విటులకు ఆశకాదా - అని భావం.

ముయ్యవే తలుపు సమ్యగి దానీం

తియ్యవే కుచత టో పరి వస్త్రమ్

ఇయ్యవే మధురబింబమివౌష్ఠం

చెయ్యవే రతిసుఖం మమ బాలే

క్రిందిపదాలకు అర్థాలు చూస్తే వివరణ అవసరంలేదు చూడండి-

సమ్యక్ - బాగుగా, ఇదానీం - ఇప్పుడు, కుచతటోపరి - స్తనాలపై భాగాన,

మధురబింబం - తియ్యని దొండపండు, ఓష్ఠం - పెదవి, మమ - నాకు,

బాలే - బాలికా.

+++++75

అనేక భాషల మిశ్రమంతో వ్రాసిన అంశాన్ని మణిప్రవాళ శైలిలో ఉంది అంటాము. మన

గురజాడవారి కన్యాశుల్కంలోని కొన్ని విషయాలు-

కన్యాశుల్కము ప్రథమాంకంలో

గిరీశం - యీ వ్యవహార మొహటి పైసలైంది. ఈ రాత్రికి మధురవాణికి

సార్టింగ్ విజిట్ యివ్వంది పోకూడదు.

నీ సైటు నాడిలైటు

నిన్ను మిన్న

కానకున్న

క్వైటు రెచడ్ ఫ్లైటు

మూనులేని నైటు

బంట్రోతు -

ఫుల్లుమూను లైటటా

జాసమిన్ను వైటటా

మూను కన్న

మొల్ల కన్న

నీదు మోము బ్రైటటా

టా! టా! టా!

పంచమాంకంలో

పూజారి - మా మధురవాణిమీద ఆశుకవిత్వం చెబుతాను

రాణా, డైమండ్ రాణీ

రాణా, యిస్పేటు రాణి రాణికళావ

ఝాణా, ఆఠీన్రాణీ

రాణియనన్మధురవాణె, రాజులరాణి

దీనిలో ఎక్కువభాగం ఇంగ్లీషు పదాలను తక్కువగా తెలుగు పదాలను వాడాడు.

+++++76

నాపేరులో ఐదక్షరాలున్నాయి అందులో

మొదటి అక్షరానికి అగ్ని అని అర్థం, మధ్యనున్న అక్షరానికి ముల్లు అని అర్థం, చివరనున్న అక్షరానికి కీర్తి అని అర్థం, నాలుగవ అక్షరానికి బంగారని అర్థం, మొదటి రెండక్షరాలకు స్త్రీ అని అర్థం, రెండవ అక్షరం మొదటక్షరం కలిపిచదివితే కీలు అని అర్థం, నాలుగు రెండు అక్షరాలను కలిపిన సీతాపతి అని అర్థం, ఒకటి మూడు అక్షరాలను కలిపిన సమరమని అర్థం, చివరి రెండక్షరాలు కలిపిన మన్మథుని మామ అని అర్థం, నాలుగు మూడు అక్షరాలను కలిపిన ప్రీతి అని అర్థం, ఇంతకు నా పేరేమో చెప్పగలరా?

జవాబు - **రమణరాజు**

ఎలాగంటారా - మొదటి అక్షరానికి అగ్ని అని అర్థం -**ర - అగ్ని**

మధ్యనున్న అక్షరానికి ముల్లు అని అర్థం- **ణ - ముల్లు**

చివరనున్న అక్షరానికి కీర్తి అని అర్థం- **జు - కీర్తి**

నాలుగవ అక్షరానికి బంగారని అర్థం- **రా - బంగారు**

మొదటి రెండక్షరాలకు స్త్రీ అని అర్థం- **రమ - స్త్రీ**

రెండవ అక్షరం మొదటక్షరం కలిపిచదివితే కీలు అని అర్థం- **మర - కీలు**

నాలుగు రెండు అక్షరాలను కలిపిన సీతాపతి అని అర్థం- **రామ - సీతాపతి**

ఒకటి మూడు అక్షరాలను కలిపిన సమరమని అర్థం

రణ - యుద్ధం, సమరం

చివరి రెండక్షరాలు కలిపిన మన్మథుని మామ అని అర్థం

రాజు - చంద్రుడు, మన్మథుని మేనమామ

నాలుగు మూడు అక్షరాలను కలిపిన ప్రీతి అని అర్థం

రాణ - రమణ యొక్క రూపాంతరం - ప్రీతి

ఇది నాపేరు **రమణరాజు**

+++++77

కావ్యాలంకారం సంగ్రహం వివరణములో ఉదాహృతమైన స్మరణాలంకార ఉదాహరణ. ఇది సంవాద చిత్రంలో ఉంది.

సౌమిత్రే !నను సేవ్యతాం తరుతలం చండంశు రుజ్జృంభతే

చండంశో ర్నిశి కా కథా? రఘుపతే! చంద్రో2యమున్మీలతి

వత్సైత ద్విదితం కథంనుభవతా? ధత్తే కురంగం యత:

క్వాసి ప్రేయసి! హా కురంగ నయనే! చంద్రాననే! జానకీ!

శ్రీరాముడు- లక్ష్మణా! ఎండ కాయుచున్నది చెట్టునీడకు పద

లక్ష్మణుడు- శ్రీరామా రాత్రి సూర్యు డెక్కడ? చంద్రుడు వెన్నెల
కాయుచున్నాడు.

రాముడు- నీకు చంద్రుడని ఎట్లు తెలిసింది?

లక్ష్మణుడు- అందు కురంగమున్నది.

రాముడు- హా! కురంగనయనా! సీతా! ఎటనుంటివి.

అని సీతాస్మరణము కలిగినది.

+++++78

ఈ క్రింది శ్లోకం వాయువుకు మామిడి కొమ్మకు మధ్య జరిగిన సంభాషణ.

శ్లో. చిరశ్రాంతో దూరాత్ అహముపగతో హన్త మలయాత్

తదేకం త్వద్గేహే తరుణి పరిణేష్యామి దివసమ్

సమీరేణోక్త్యేవం నవకుసుమితా చూతలతికా

ధునానా మూర్ధానం నహి - నహి - నహీ త్యేవ వదతి

మండు వేసవిలో వాయువు మామిడి కొమ్మతో - "నేను మలయ పర్వతం నుండి అలసి వచ్చాను. నీ దగ్గర ఒక్కనాడు గడుపదలచాను" - అని అన్నాడు. దానికి కొత్తగా పుష్పవతి అయిన ఆ మామిడి కొమ్మ "వద్దు! వద్దు! వద్దు!" - అని మూడుసార్లు అన్నది. (దీని భావమేమంటే మూడు రోజులు ఆగు అని.)

+++++79

ప్రేయసి ప్రియుల మాటలు ఎంత సరసంగా ఉంటాయో చెప్పడానికి ఈ శ్లోకం చూస్తే తెలుస్తుంది. ఇది చాటుధరాచమత్కారసారమనే దానిలోనిది.

శ్లో. కఠిన కుచౌ తవ బాలే, చటుల చకోరాక్షి తావకే నయనే

కుటిల సుకే శ్యలకా స్తే మిథ్యావాదిన్లతాంగి తవ మధ్యమ్

ప్రేయసి - కఠిన! (ఓ కఠినుడా!) , ప్రియుడు - కుచౌ తవ బాలే

(ఓ బాలికాతిలకమా! నీకుచములు కఠినముగాని నేనుగాదు)

ప్రేయసి - చపల! (ఓ చపలస్వభావం కలవాడా!)

ప్రి - చకోరాక్షి తావకే నయనే (ఓ చకోరమువంటి కన్నులు గలదానా! నీకన్నులే చపలములు నేనుగాదు.)

ప్రే.- కుటిల! (వంకర నడతగలవాడా!) , ప్రి.- సుకే శ్యలకా స్తే

(మంచి వెంట్రుకలుగలదానా! నీముంగురులే కుటిలములు నేనుగాదు)

ప్రే.- మిథ్యావాదిన్! (కల్లరీ!, మిథ్యను పలికేవాడా!),

ప్రి. - లతాంగి తవ మధ్యమ్

(తీగెవలె సన్ననిశరీరంగలదానా! నీ నడుమే మిథ్య(కల్ల) నేను కాదు)

+++++80

కొందరి నోటివాక్కు అమోఘం. శాపానుగ్రహదక్షులైన కవిపుంగవులు అనేకులు ఉన్నారు.

వారిలో **గోగుపాటి కూర్మనాథకవి** ఒకరు.

ఒకమారు సింహాచల క్షేత్రం మీదకు మహమ్మదీయ సేనలు రాగా

గోగుపాటి కూర్మనాథకవి ఆక్రోశం చెందగా అప్రయత్నంగా

"వైరి హరరంహ! సింహాద్రి నారసింహ!" అనే మకుటంతో సీసాలు దొర్లుకుంటూ కవిగారి నోటి వెంట ధారాపాతంగా వచ్చాయట.

ఆ భావతీవ్రతలో స్వామిని ఆయన బ్రతిమలాడాడు, ఆక్షేపించాడు, ఎద్దేవా చేశాడు. వాటిలో ఒకటి ....

పాశ్చత్యుల నమాజుపై బుద్ధి పుట్టెనో మౌనుల జపముపై మనము రోసి

యవనుల కందూరియం దిచ్చ చెందెనో విప్ర యజ్ఞములపై విసుగు బుట్టి

ఖానజాతి సలాముపై నింపు పుట్టెనో దేవతా ప్రణతిపై భావ మెడలి

తురకల యాదునందు ముదంబు గల్గెనో భక్తి నిత్యోత్సవ పరతమాని

వాండ్రు దుర్మార్గులయ్యయో వ్రతము చెడ్డ

సుఖము దక్కదు వడి ఢిల్లి చొరగద్రోలు

పారసీకాధిపుల పటాపంచలుగను

వైరి హరరంహ! సింహాద్రి నారసింహ!

అభీర గృహముల అర కాగిన పామీగడల్ వడి దిగమ్రింగగలవు. కాని యవనులపై వడి పారలేవు.

కబళమున నోరు తెరతువు, కళ్ళెమన్న మోము త్రిప్పు హయగ్రీవమూర్తి వహహ! - అని ఆక్షేపించాడు

పాలియ్యవచ్చిన భామిని ప్రాణాలు అపహరించినట్లు కాదయ్యా చేతనైతే

ఈ తురకలను నాశనం చేయమని వేడుకొన్నాడు.

మేము నిన్ను అగ్రహారాలను ఇవ్వమని అడగడంలేదు.

కరిహయాదుల మేము కాంక్షించలేదు. జనులను దోచుకోకుండా చూడమనే మా ప్రార్థన - అని

అంటూ 67 పద్యాలు పూర్తి చేసేసరికి కొన్ని లక్షల, కోట్ల గండుతుమ్మెదలు కొండలోనుండి బయలుదేరి ప్రళయకాలంలో కారుమేఘాల్లా కమ్ముకుని తురకల దండుపైకి మూగి, కండలు ఊడేట్లుగా కరచి, నెత్తురు పీల్చి వారిని విశాఖపట్టణం దాకా బ్రతుకుజీవుడా! - అని పారిపోయేలా చేశాయట. ఆ దృశ్యాన్ని చూచిన కూర్మనాథుడు ఇలా వర్ణించాడు.

కారుణ్య దృష్టిచే కని మమ్ము రక్షింప నీరజేక్షణ నీవు నేడు పంప
పారసీకుల దండుపై కొండలోనుండి గండుతుమ్మెదలు నుద్దండ లీల
కల్పాంతమున మిన్ను గప్పి భీరకమైన కారుమేఘంబులు గవిసినట్లు
తాకి బోరున రక్తధారలు దొరగగా కరచి నెత్తురు పీల్చి కండలెల్ల
నూడిపడ నుక్కు మూతులవాడి మెరసి
చించి చెండాడి వధియించె చిత్రముగను
నొక్కొకని చుట్టుముట్టి బల్మిక్కుటముగ
వైరి హరరంహ! సింహాద్రి నారసింహ!

ఈవిధంగా అనేకవిధాల నరసింహస్వామిని స్తుతిస్తూ ....

మిగిలిన పద్యాలను పూర్తి చేశాడట.

+++++81

రేయి యెండగాసె రేవెల్లు వేడియై
వెలిగె వేవెలుంగు కలువకన్నె
నవ్వజేసె తొగల నాథుడు పద్మినీ
రమణి రమింప(రామియింపరవిచెలంగె(

ఈ పద్యంలో సాధారణంగా మనకు కనిపించే అర్థం-

చంద్రుడు వేడిగా ప్రకాశిస్తున్నాడు. సూర్యుడు కలువకన్నెను నవ్విస్తున్నాడు. చంద్రుడు పద్మినీ కాంతతో రమిస్తున్నాడు.

సూర్యుడు సంతోషిస్తున్నాడు ఇది సరైనదేనా ఇందులో అన్నీ విపరీతమైన అసభ్యకరమైన విషయాలు కనిపిస్తున్నాయి. మరి సరైన అర్థం ఎలా తీసుకోవాలి అంటే పద్యాన్ని ఇలా విరుచుకోవాలి-

రేయియెండ గాసె రేవెల్లు

వేడియై వెలిగె వేవెలుంగు

కలువకన్నె నవ్వగజేసె తొగలనాథుడు

పద్మినీ రమణితో రమింప రవిచెలంగె

ఈ విధంగా మార్చుకున్నపుడు అర్థం -

చంద్రుడు వెన్నెలగాసె(రేయియెండ), సూర్యుడువేడిగా వెలిగెను (వేవెలుంగు), చంద్రుడు

కలువకన్నెను నవ్వించెను(వికసింపచేసెను)

సూర్యుడు పద్మలతతో పరవశించెను

+++++82

భగవంతుడు సర్వవ్యాపి కదా! ఈ పద్యంలో **కాసుల పురుషోత్తమకవి**

భగవంతుడు లేడనికదా! వారు ఆవిధంగా ప్రవర్తించింది అంటూ పద్యం చెప్పాడు

అచట లేవని కదా! యరచేత జఱచె గ్రుద్ధత సభస్తంభంబు దానవేంద్రు

డచట లేవనికదా! యస్త్రరాజం బేసె గురుసుతుం డుత్తోదరము నందు

నచటలేవనికదా! యతికోపి ననిచె పాండవులున్న వనికి గౌరవకులేంద్రు

డచటలేవనికదా! యాత్మీయసభను ద్రౌపదివల్వ లూడ్చె సర్పధ్వజుండు

లేక యచ్చోటులను గల్గలేదె ముందు

కలవు కేవల మిచ్చోట గల్గు టరుదె

చిత్రచిత్ర ప్రభావ! దాక్షిణ్యభావ!

హతవిమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ!

(ఆంధ్రనాయక శతకము -9)

బహు విచిత్రమైన మహిమకలవాడా! దయాభావం కలవాడా! శత్రుసంహారకుడా! శ్రీకాకుళం అనే క్షేత్రంలో వెలసిన ఆంధ్రనాయకుడను పేరుగల విష్ణుమూర్తీ !

స్తంభంలో ఉండవని హిరణ్యకశిపుడు స్తంభాన్ని అరచేతితో కొట్టాడు.

ఉత్తర గర్భంలో ఉండవని బ్రహ్మాస్త్రాన్ని అశ్వత్థామ ఉత్తర కడుపులోని శిశువుపై ప్రయోగించాడు.

అడవిలో ఉండవని కోపిష్టియైన దూర్వాసుని పాండవుల వద్దకు పంపాడు దుర్యోధనుడు. సభలో ఉండవని ద్రౌపది వస్త్రాలనులాగించాడు సుయోధనుడు. మొదట అక్కడ లేకపోయినా స్తంభాదుల్లో నీవు సాక్షాత్కరించావు. మరి ఈ శ్రీకాకుళం గుడిలో

మొదటినుండి వెలసి ఉన్నావు ఇక్కడ కనిపించడంలో ఆశ్చర్యం కానేకాదు - అని భావం.

+++++83

మనం ఏ వేషంలో ఉన్నా మనం భారతీయులం అనే విషయాన్ని మరిచిపోలేం కదా! అదే విషయాన్ని **అక్బర్ అలహాబాదీ**(1846-1921)

అనేకవి భారతీయుణ్ణి నిలదీసిన కవితావాక్యాలు ఇవి -

హర్ చంద్ కె కోట్ భిహై పత్లూన్ భిహై

బంగ్లాభీహై పాట్ భిహై సాబూత్ భిహై

లేకిన్ మై తుఝ్ సే పూఛ్తా హూ హిందీ

యూరప్ క తెరీ రగోమ్మె కుఛ్ ఖూన్ భిహై

నీకు కోటున్నది. పంట్లామున్నది. భవనమున్నది. సబ్బుబిళ్ల ఉన్నది. సబ్బు పెట్టె ఉన్నది. అయినా ఓ భారతీయుడా! ఆలోచించి చెప్పు.

యూరప్ వేషమయితే అమరిందిగాని నీరక్తనాళాల్లో యూరప్ రక్తమే ఉన్నదా? - నిజమేకదా మనలో మన భారతీయ రక్తంకాక అమెరికా యూరప్ రక్తం ఉంటుందా అంటే మనం భారతీయుల్లాగానే ప్రవర్తిస్తాంకదా!

+++++84

మనమందరం ఎక్కువగా పోతన భాగవతంలోని గజేంద్రమోక్షణమే చదివివుంటాం. అందులో శ్రీమహావిష్ణువు గజేంద్రుని రక్షించే సమయంలో

లక్ష్మీదేవి ఏ విధంగా వెళ్ళిందో విష్ణువుతోటి తెలిపే **ఆదిభట్లనారాయణదాసు** గారి ఈ పద్యం అవధరించండి-

అంసభాగంబున నాడెడు గొప్ప కొప్పున సన్నజాజులు పుడమిరాలఁ

జిన్ని కెంజాయ వాల్గన్నులు కమ్మల దివిటీల మును నటుల విధమొప్ప

హరికరాకృష్ట చేలాంచలంబున నీవి యందునఁ బాణిద్వయంబు మెఱయ

మోము పేకువ చందమామ పోల్కిని వెల్గ నధరంబుపై కెంపులలరుచుండఁ

గాలి పావడ జీరాడ కాంచి వీడ, కౌను జవ్వాడ నారద మౌని పాడ

మేచకముతోడఁ దొల్కరి మెఱుపుజాడ, నేఁగు దెంచెను లక్ష్మి సర్వేశునీడ

+++++85

హసంతీం చ హసంతీం చ

హసంతీం వామలోచనామ్

హేమంతే యే న సేవన్తే

తే నరా దైవవంచితాః

దీనిలో హసంతీ శబ్దం మూడుమార్లు ప్రయోగించబడింది. ఒకదానికి

కుంపటి, మరొకటి **కంబళి**, మూడవదానికి **నవ్వుతున్న** అనే విశేషణార్థం.

కుంపటినిగాని, కంబళినిగాని నవ్వుతూన్న అందమైన కన్నులున్న

యువతినిగాని చలికాలంలో ఎవరు ఆశ్రయించరో, వారు దురదృష్టవంతులు - అని చెబుతున్నాడు

కవి. చలిబాధ తప్పుకోవటానికి కొందరు

కుంపటి ముందు కూర్చుంటారు మరి కొందరు కంబళి కప్పుకుని

వెచ్చదనాన్ని పొందుతారు, నవ్వుతున్న ప్రియురాలి గాఢాలింగనంతో

చలినుండి తప్పించుకుంటారు. ఈ మూడింటిలో ఏదీ లభించనివారు

నిజంగా విధివంచితులని కవి చమత్కారంగా చెప్పాడు.

+++++86

కొక్కొండ వేంకటరత్నంగారు **బిలేశ్వరీయం**లో ఈ విధంగా చెప్పారు -

కన్నులఁ జూపు గల్గిననుఁ గాంచఁగ నీ దెదురైన, వీనులన్

బన్నుగ విన్కి గల్గిన ననన్ విన నీ, దిఁక నోరు పల్కఁగా

నున్ననుఁ బల్కనీదు, మఱి యున్నను జేతులు మ్రొక్క నీదు, సం

పన్నుని గర్వ, మత్తెవులుఁ బాపెడి లేవడియేన్ విరక్తుఁడేన్

(బిలేశ్వరీయము -3- 15)

ఏ విధంగా ధనం సంపాదించినా వానికి అది చెప్పగరాని గర్వం కలిగిస్తుంది.

అదే అతనికి పెద్దజబ్బు ఆ జబ్బు కొన్ని లక్షణాలను కలిగి ఉంటుంది అని వాటిని పేర్కొంటూ ఈ

పద్యం చెప్పాడు కవి. సంపన్నుని గర్వం-

కంటికి చూపు బాగానే ఉన్నా, ఎవరైనా పెద్దలు ఎదురిగా వచ్చినా

వారిని కన్నెత్తి చూడనివ్వదు. అలాగే చెవులు ఏలోపం లేకపోయినా

వినికిడి శక్తి ఉన్నా మనం చెప్పింది విననివ్వదు. ఇక నోరు స్పష్టంగా మాట్లాడటానికి శక్తి ఉన్నా

ఎదుటివారితో ప్రియంగా మాట్లాడనివ్వదు.

అలాగే చేతులున్నా కూడ పెద్దలకు మ్రొక్కనివ్వదు డబ్బు వలన వచ్చిన జబ్బును దారిద్ర్యంగాని లేదా వైరాగ్య జ్ఞానసంపన్నుడైన యోగిపుంగవుడైనా గాని ఆ యిద్దరే పోగొట్టగలరు ఆ జబ్బును - .అని భావం

+++++87

ఈ పద్యాలలో హల్లు ఒకటే ఉంటుంది కానీ అచ్చులు ఏవైనా వాడవచ్చు.

గమనించండి-

నిన్ను నిను నెన్న నీనే

నెన్నిన నన్నన్న నననినిన నానే నా

నిన్నూని నా ననూనున్

నన్నూనన్నాను నేననా నున్నానా

శ్రీవేంకటేశ చిత్రరత్నాకరం పూర్వభాగంలోనిది.

అనిన = నీకుపైన ప్రభువులులేని, నానా = సర్వమునకు, ఇనా = ప్రభువైనవాడా, ఇనున్ = సర్వేశ్వరుడవైన, నిన్నున్, ఎన్నన్ = స్తుతించుటకొరకు, ఈనేను, ఎన్నినన్ = ఆలోచించినచో, నసను = చిగురును, (అల్పుడని అర్థం), అన్నన్న = చోద్యం, అనూనున్ = గొప్పవాడవైన, నినున్ = నిన్ను, ఊనినాను = ఆశ్రయించినాను, నున్న = త్రోసివేయబడిన, అనా = శకటముగలవాడవైన, అనా = తండ్రీ, నేను, నన్ను + ఊను = ఆదుకొనుము, అన్నాను = అంటిని.

మామా మీమో మౌమా

మామా! మిమ్మొమ్ము మాము మామా మేమా

మేమొమ్మము మీ మైమే

మేమే మమ్మోము మోము మిమమ్మో మౌమా!

(చంపూ భారతం పుట. 249)

మా = చంద్రుని యొక్క, మా = శోభ, మోము + ఔ = ముఖముగా గల,

మామా- మా = మాయొక్క, మా = మేధ, మిమ్ము = మిమ్ములను, ఒమ్ము =-అనుకూలించును, మామమామా = మామకు మామవైన దేవా!, ఆము = గర్వమును, ఏమి =- ఏమియు, ఒమ్మము = అంగీకరిం చము, మీమై = మీ శరీరము, మేము ఏమే = మేము మేమే, మమ్ము,

ఓ ముము + ఓముము = కాపాడుము, కాపాడుము, ఇమ్ము = అనుకూలము, ఔము = ఔమా + అగుము - అగుమా

లోలాళిలాలిలీలా
ళీలాలీలాలలేలలీలలలలులే
లోలోలైలాలలల
ళ్లీలైలలలాలలోలలేలోలేలా

(ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసంలోని 223వ పద్యం)

(ఇందులో ల-ళ లకు భేదము లేదు కావున పద్యమంతా ల - అనే హల్లుతో కూర్చబడినదిగా భావించాలి)

లోల - చలించుచున్నట్టి, అళి - తుమ్మెదలను, లాలి - లాలించునట్టి, లీలా - శృంగారక్రియగలిగినట్టి, ఆళీ - చెలికత్తెలయొక్క, లాలీ - లాలిపాటల
యొక్క, లాల - లాలయను పాటయొక్క, ఏల - ఏలపదాలయొక్క,
లీలలు - విలాసములు, అలలు - అతిశయములు, లే - అవులే, లోలో - లోలోయనే, ల - స్వీకరించయోగ్యమయినట్టి, ఐల - గుహలయందు, అల - అఖండములయినట్టి, లలత్ - కదలుచున్నట్టియు, లీల - క్రీడార్థమయి నట్టియు, ఏలల - ఏలకీతీగలయొక్క, లాల - ఉయ్యాలలు, ఓలలు - హేరాళములే, లోల - ఆసక్తిగలిగిన, ఐలా - భూదేవిగల శ్రీవేంకటేశ్వరస్వామీ

+++++91

అయ్యలరాజు రామభద్రుని **రామాభ్యుదయము**లోని ఈ పద్యం చూడండి-

ఇది రాముడు అరణ్యమునకు పోవు సందర్భములో దశరథడు బాధతో పలికిన పలుకులు ఎంత చమత్కారంగా చెప్పబడినవో గమనింపుడు.

కానక గన్న సంతానంబు గావున గానక గన్న సంతానమాయె
నరయ గోత్ర నిధానమై తోచుగావున నరయ గోత్ర నిధానమయ్యె నేడు
ద్విజకులాదరణ వర్ధిష్ణుడు గావున ద్విజ కులాదరణ వర్ధిష్ణుఁడయ్యె
వివిధాగమాంత సంవేద్యుండు గావిన వివిధాగమాంత సంవేద్యుఁడయ్యెఁ
గటగటా దాశరథి సముత్కట కరీంద్ర

కట కలిత దాన ధారార్ద్ర కటక మార్గ

గామి, యెటు సంచరించు, నుత్కట కరీంద్ర

కటకలిత దాన ధారార్ద్ర కటకతటుల (రామాభ్యుదయము -5-12)

ఈ పద్యంలో ముందు భాగం తరువాతి భాగం ఒకలానే కనిపిస్తూ అర్ధభేదంకలిగి ఉన్నాయి.

1. **కానక గన్న సంతానంబు** - కలుగక కలిగిన సంతానము,

అడవికొరకే కన్నసంతానము.

2. **గోత్రనిధానము** - వంశమునకు మూలమైనది,

కొండలు నివాసముగా గలది

3. **ద్విజకులాదరణ వర్ధిష్ణుడు** - బ్రాహ్మణ కుమును పోషించువాడు,

పక్షిసముదాయమును పోషించువాడు.

4. **వివిధాగ మాంత సంవేద్యుఃడు** -

బహువిధ వేదాంతములవలన తెలిసుకొన దగినవాడు,

బహువిధ వృక్షములనడుమ తెలిసుకొన దగినవాడు

5. **సముత్కట కరీంద్ర కటక మార్గ ....**

ఏనుగుల మదజలముచే తడిసిన పురములకేగువాడు,

ఏనుగుల మదజలముచే తడిసిన కొండవాలులుగల త్రోవలందు సంచరించువాడు -

ఈ విధంగా రెండర్ధములను ఆలోచిస్తూ దు:ఖిస్తున్నాడు దశరథుడు.

+++++92

ఇందులో రెండు వైదిక మంత్రవాక్యములతో కూర్చి చెప్పడం విశేషం

అణోరణీయా న్మహతో మహీయాన్

మధ్యేనితంబశ్చ యదంగనాయాః

తదంగహారిద్రవిలేపనేన

యజ్ఞోపవీతం పరమం పవిత్రమ్

దీనిలోని మొదటి పాదంలోని మంత్రం పరమాత్మనుగూర్చి చెబుతుంది

చివరి పాదం యజ్ఞోపవీతం గొప్పతనాన్ని తెలుపుతుంది. పరస్పరం సంబంధంలేని వాటిని

ఏకవాక్యంగా మలిచాడు ఈ కవి. దీని అర్థం-

ఏ స్త్రీ యొక్క నడుము అణువు కన్నా చిన్నదో నితంబము(పిరుదుల భాగం) మహత్తు కంటే పెద్దదో, అటువంటి తరుణి శరీరపు పసుపురంగు

పూయబడటంచేత యజ్ఞోపవీతం చాలాపవిత్రమై పోయింది -

అని భావం

+++++93

ఒక పద్యాన్ని మొదటినుండి చదివినా చివరనుండి మొదటికి చదివినా

ఒకలాగే ఉంటే దాన్ని **ప్రతిలోమానులోమము** అంటారు అది కందమైతే

ప్రతిలోమానులోమకందము అంటారు. దీనికి ఉదాహరణ **నంది మల్లయ్య - ఘంట సింగన్న** లు

వ్రాసిన **వరాహపురాణము**లోనిది -

సారసనయనాఘనజఘ

నారచితరతారకలికహరసారరసా

సారరసారహకలికర

తారతచిరనాఘజనఘనాయనసరసా

(వరాహపురాణము -9- 155)

ఈ రెండు పాదాలను సరిగా గమనించండి. ఇందులో మొదటి వరుసలో ఉన్న అక్షరక్రమమే

విలోమంగా రెండవ వరుసలో ఉన్నాయి. ఈ విధంగా రావడం వలన ఎటుచదివినా ఒకలాగే వస్తుంది .

అందువల్ల దీన్నిప్రతిలోమానులోమ కందం అంటున్నాము. దీనిలో మరో గమ్మత్తుకూడ ఉంచారు

ఈ జంటకవులు అదేమిటంటే ఈ పద్యం పెదిమలు తగలకుండా చదువవచ్చు అంటే

ఇది **నిరోష్ఠ్యం** కూడా

+++++94

ఒకమాట ముందుకే గాదు వెనకకూ అలాగే ఉంటే మనము అది చిత్రంగా

గుర్తిస్తాం కదా

జలజ - కనక - కటక - నళిన - భద్రేభ - ముల్

సఖియ కంఠ-కాంతి-జఘున-చరణ-

గమనములకు సాటిగానక తన వృత్తి

ఎదిరి పూర్వరూప పదమునందె

నాయిక కంఠ, కాంతి, జఘున, చరణ, గమనములతో జలజ, కనక,కటక, నళిన, భద్రేభ - ములు

పోటీ పడినవట అవి ఎంత ప్రయత్నించినా!

వాటికి సాటిరాలేక తలక్రిందులుగా పోరాడి కూడ పూర్వరూపంలోనే ఉన్నాయట. కారణం ఏమిటంటే ఆ పదాలన్నీ అనులోమంగాను ప్రతిలోమంగాను ఒకటే ఇది ఆమె సౌందర్య పరాకాష్ఠ తెలపటమే.

+++++95

"క-ల" అనే రెండు హల్లులను ఉపయోగించి కూర్చిన శ్లోకం

ఇందులో హల్లులు రెండే. వాటికి అచ్చులు ఏవైనా ఉండవచ్చు.

కాలేకిలాలౌకికైక

కోలకాలాలకేలల

కలికాకోలకల్లోలా

కులలోకాలిలాలికా

దీని అర్థం-

అలౌకిక = లోకవిలక్షణమైన, ఏక = ముఖ్యమైన, కోల = ఆదివరాహ స్వామియొక్క, కాలాలకే = భార్యవైన, ఓ లక్ష్మీ,(కాల = నల్లని, అలకే = ముంగురుగలదానా!) కలి = కలికాలమనే, కాకోల = విషముయొక్క, కల్లోల = అభివృద్ధిచే, ఆకుల = బాధపడుచున్న, లోక + అలి = ప్రజా సమూహమును, లాలికా = రక్షించుచున్న, (త్వమ్) నీవు, కాలేకిల = అపాయసమయమున మాత్రము, లల = సాక్షాత్కరించి ప్రకాశింపుము.

+++++96

ఓష్ఠం అంటే పెదవి. ఓష్ఠ్యం అంటే పెదవులయందు పుట్టేది. వ్యాకరణ పరిభాషలో ఓష్ఠ్యం అంటే పెదవుల కలయికతో పలకడానికి వీలయ్యే అక్షరం. నిరోష్ఠ్యం అంటే పెదవుల కలయికతో అవసరంలేకుండా పలుకబడేవి. ప,ఫ,బ,భ,మ,వ,ఉ,ఊ,ఒ,ఓ,ఔ - అనేవి పెదవుల సాయంతో పలుకబడేవి. ఇవి లేకుండా పద్యం లేక శ్లోకం లేక వచనం లేక దండకం ఇలా ఏదైనా రాస్తే అది నిరోష్ఠ్యం అవుతుంది.

అథాగ్రే హసతా సాచిస్థితేన స్థిరకీర్తనా

సేనాన్యా తేజగదిరే కించిదాయస్తచేతసా

(కిరాతార్జునీయమ్ - 15-7)

(ఈవిధంగా పరుగెత్తిపోతున్న సేనను చూచి వారికెదురుగా ముందుభాగంలో నిలిచి సేనాని కార్తికేయుడు ఖిన్నులైన ప్రమథగణంతో ఇట్లా అన్నాడు.)

+++++97

సరసం అంటేనే భార్యా భర్తల మధ్యగాని, ప్రేయసీ ప్రియుల మధ్యగాని జరిగేది. అవి ఎంత గూఢంగా ఉంటాయో ఇక్కడ చూడండి-

ఇక్కడ భార్యాభర్తల సంభాషణ చూద్దాం-

భోజనసమయంలో భర్త (భార్యను) - **పశువ** (అన్నాడు)

భార్య(భర్తను) - **కోతి** (అన్నది) - ఇందులో ఏముంది సహజమేకదా!

అదీ నిజమే. కాని ఒక అవధాని ఈ సుభాషణను ఇలా వివరించారు

భర్త (భార్యను) - **ప**ళ్లెం **శు**ద్ధంచేసి **వ**డ్డించవే (అన్నాడు)

భార్య(భర్తను) - **కో**రినంత **తి**నండి (అన్నది)

దీనిలోని గూఢత తెలిసిందికదా!

+++++98

లక్ష్మి శివుని తోడ లలిమీరగూడిన

భువనకారకుండు పుట్టవలయు

లచ్చి శంకరుండు లలిమీర గలసిన

విష్ణుదేవుడుద్భవింప వలయు

ఇది పైకి అశ్లీలగా, భ్రాంతి కలిగించి, మెదడుకు పదును పెడుతున్నది.

నిదానంగా ఆలోచిస్తే విషయం అర్థమౌతుంది.

లక్ష్మి కి పర్యాయపదాలు చూస్తే - కమల, లచ్చి, రమా, ఇందిర .... ఉన్నాయి. అలాగే శంకరునికి పర్యాయపదాలు - భవుడు, ఈశ్వర,ఈశ,....

పై పద్యంలో మొదటి రెండు పాదాలు తీసుకుంటే

లక్ష్మి శివుని తోడ లలిమీరగూడిన - భువనకారకుండు పుట్టవలయు

లక్ష్మి పర్యాయపదం కమల, శంకర పర్యాయపదం భవుడు,

లక్ష్మి కి శంకరుడు కలిసిన భువనకారకుడు పుట్టాలికదా

పర్యాయపదాలను తీసుకుంటే

కమల(లక్ష్మి) - **భవుడు**(శంకరుడు) ఈ రెండిటిని కలిపిన **కమలభవుడు**

అంటే భువనకారకుడు(బ్రహ్మ)కదా!

అలాదే చివరి రెండు పాదములు తీసుకొన్న

లచ్చి శంకరుండు లలిమీర గలసిన - విష్ణుదేవుడుద్భవింప వలయు

లక్ష్మి ని శంకరుడు కలిసిన విష్ణువు పుట్టాలి

పర్యాయపదాలను తీసుకుంటే

రమా(లక్ష్మి) - **ఈశ**(శంకరుడు) - **రమేశ** అంటే విష్ణువేకదా!

మరి ఇందులో అశ్లీలలేదుకదా!

+++++99

అష్టదిగ్గజాలలో ఒకరైన వారు ఈ పద్యాన్ని కృష్ణదేవరాయల మీద చెప్పారు. అది తెనాలి రామకృష్ణుడని కొందరు భట్టుమూర్తి అని కొందరు చెబుతున్నారు. ఎవరైనా ఆయన ఆస్థానంలోనివారేకదా! ఆ పద్యం

నరసింహ కృష్ణరాయని

కర మరుదగు కీర్తి యొప్పె, కరిభి ద్గిరిభిత్

కరికరిభిద్గిరి గరిభిత్

కరిభిద్గిరిభిత్తురంగ కమనీయంబై !

అర్ధం :- కృష్ణరాయని - కరము - అరుదు - అగు = మిక్కిలి ఆశ్చర్య కరమైన, కీర్తి, కరిభిత్ = గజాసురుని సంహరించిన శివుని వలెను, గిరిభిత్ కరి = పర్వతముల రెక్కలను భేదించిన ఇంద్రుని యొక్క ఏనుగు ఐరావతము వలెను, కరిభిత్ - గిరి = ఈశ్వరుని కైలాస పర్వతము వలెను, గిరి - భిత్ = కొండలను భేదించిన - వజ్రాయుధము వలెను, కరిభిత్ - గిరిభిత్ - తురంగ = ఈశ్వరుని - ఇంద్రుని వాహనములైన నందీశ్వర, ఉచ్ఛైశ్శ్రవముల వలెను, తెల్లగా, ధగద్ధాగాయమానమై, కమనీయంగా ఒప్పి కనిపించెను.

+++++100

సురలను సురలే మ్రింగిరి

పరగంగా బ్రహ్మవచ్చి భానుని మ్రింగెన్

అరయగ నప్పురి చెంతను

శిరహీనుని శివుడుమ్రింగె చిత్రముగాదే!

(నానార్థగాంభీర్యచమత్కారిక పుట.14)

దీనిలో దేవతలను దేవలు మ్రిండమేమిటి? బ్రహ్మ వచ్చి సూర్యుని మ్రింగడమేమిటి? శిరహీనుని శివుడు మ్రింగడమేమిటి? - చిత్రమేకదా

బాగా ఆలోచిస్తే ఇందులోని పదాలకు

మరో అర్థం ఉండి ఉండాలి లేకుంటే ఇది ఎలా?

సురలను సురలే మ్రింగిరి -

అంటే

చేపలను)సురలను) చేపలే మ్రింగాయి.

(అనిమిషులు చేపలు -, సురలు(

బ్రహ్మవచ్చి భానుని మ్రింగెన్ -

మేక)అజము-బ్రహ్మ)వచ్చి జిల్లేడు చెట్టును)భానుని- అర్కం) తినింది.

శిరహీనుని శివుడు మ్రింగె -

పీత)శిరహీనుడుఎండ్రకాయ -)ను నక్క)శివుడు) తిన్నది

+++++101

ప్రాతః ద్యూత ప్రసంగేన

మధ్యాహ్నే స్త్రీ ప్రసంగతః

రాత్రౌ చోర ప్రసంగేన

కాలో గచ్ఛతి ధీమతః

దీనిలో చూడటాని అన్నీ వ్యసనాలే కనిపిస్తాయి. కానీ వీని అర్థం గమనిస్తే గమ్మత్తైనది చూడండి- ప్రాతః ద్యూత ప్రసంగేన- అంటే ఉదయంపూట భారతం గురించిన విషయాన్ని మాట్లాడాలట (ద్యూత ప్రసంగము భారతంలో ధర్మరాజు ద్యూతం గురించి ఉందికదా) మధ్యాహ్నే స్త్రీ ప్సంగతః - అంటే మధ్యాహ్నం పూట సీతా చరితమైన రామాయణాన్ని గురించి మాట్లాడుకోవాలట. రాత్రౌ చోర ప్రసంగేన - అంటే రాత్రిపూట నవనీత చోరుడైన శ్రీకృష్ణుని గాథలను వివరించే భాగవతం గురించి మాట్లాడు కోవాలట. ధీమంతులకు ఈ విధంగా కాలం గడుస్తుందట. ఇంత విషయం ఉంది దీంట్లో.

+++++102

వినుకొండ పాలకుడైన రాయన మంత్రి భాస్కరుని గురించి చెప్పినది-

అక్షరాభ్యాసంబు శిక్ష చేసెడునాడె

ఓ వ్రాసి నా వ్రాయకుండినావు

గుణిత వేళలయందు కోరి లా కేత్వంబు

దాకు కొమ్మియ్యక తర్లినావు

ఒకటి పంక్తిని వ్రాయ నూహ నేర్చిననాడె

సున్న చుట్టక వ్రేలు సూపినావు

గణిత వేళలనాడె ఘనయుక్తిగా నేర్చు

గురుకీర్తికిని ప్రాలు గూర్చినావు

నిజకులాచార ధర్మంబు నిర్వహించి

హెచ్చుగలయట్టి దాతవై హెచ్చినావు

సరసహృదయుండ వినుకొండ శాసనుండ

భవ్యభరతుండ రాయన భాస్కరుండ

ఇందులో కవి ఎంత చాకచక్యంగా రాయని మంత్రి దాతగుణాన్ని వివరించాడోచూడండి-

అక్షరాలు దిద్దే సమయంలోనే న- అని వ్రాయలేదట (ఇక్కడ న - అంటే లేదు అని) గుణింతాలు

నేర్చే సమయంలో ల-కు ఏత్వమును,

ద-కు కొమ్మును ఇవ్వలేదట అంటే లేదు అనే మాట వ్రాను రాదట.

ఒకటి రెండ్లు నేర్చే వయసులో సున్న వ్రాయడం మానివేశాడట.

సున్న అంటే ఇక్క శూన్యం అని ఏమీలేదని అర్థం. గణిత వేళలనాడు గొప్పకీర్తిని కూర్చినాడట.

చాల గొప్పదాతగా పేరు పొందాట.

దీవిలో గుణింతాలతోనే కవి ఎంత చక్కగా వివరించాడోకదా

గుణించడం, ఏత్వమివ్వడం, కొమ్మివ్వడం, సున్నచుట్టటం ఇలాంటివి గమనించగలం.

+++++103

నెల్లూరిని పాలించిన మనుమసిద్ధికి సేనాధిపతులలో ఒకసేనాపతి ఖడ్గతిక్కన. ఒకమారు

మనుమసిద్ధికి కాటమరాజుకు మధ్య పుల్లకి విషయంలో యుద్ధం సంభవించింది. దానికి ఖడ్గతిక్కన

సైన్యసమేతం

వెళ్ళి ఎదుర్కొన్నాడు. కాటమరాజు సేనాపతులలో ఒకడైన పిన్నమ

నాయునితో జరిగిన పోరులో ఖడ్గతిక్కన తన సైన్యాన్ని కోల్పోయాడు చివరికి చేసేదిలేక మరికొంత

సైన్యాన్ని తీసుకొని పోవటానికి ఇంటికి

తిరిగివచ్చాడు దానితో తండ్రి అయిన సిద్ధనామాత్యులు కొడుపై కోపించి నానామాటలని యుద్ధంలో చావనైనా చావక నాకడుపున చెడబుట్టావని నిందించాడు. దానికి ఆ యోధాగ్రేసరుడు చాల చింతించాడు. భార్య చానమ్మ స్నానానికి నీళ్లుపెట్టి అక్కడ ఒక పసుపు ముద్దను ఉంచి నులకమంచాన్ని అడ్డు పెట్టి ఈ విధంగా అన్నది-

పగరకు వెన్నిచ్చినచో

నగరే నిను మగతనంపు నాయకు లెల్లన్

ముగురాడు వారమైతిమి

వగపేటికి జలకమాడ వచ్చిన వేళన్

(శత్రువులకు వీపుచూపి వస్తే మగతనం వున్న నాయకులు నవ్వరా ఇంట్లో ఇప్పుడు ముగ్గురు ఆడవాళ్ళమైనాము బాధఎందుకు స్నానం చేసేవేళ)

అదేసమయంలో అన్నం పెట్టే సందర్భంలో తల్లి విరిగిన పాలు పోసి ఈ విధంగా అన్నది-

అసదృశముగ నరివీరుల

పసమీరగ గెలువలేక పందక్రియన్ నీ

వసి పైచి విరిగి వచ్చిన

పసులున్ విరిగినవి తిక్క పాలున్ విరిగెన్

(అసమానమైన శత్రువులు బలం పెరగ్గా గెలువలేక పిరికిపందవలె నీవు కత్తిని పక్కన పెట్టి తిరిగివచ్చావు పశువులు విరిగి పాలువిరిపోయాయి తిక్కనా)

ఈ మాటలతో సైన్యాన్ని తీసుకొని మనుమసిద్ధి వద్దన్నా వినకుండా ఒప్పరించుకొని యుద్ధానికి వెళ్ళి భయంకరంగా పోరాడి వీరమరణం పొందాడు.

ఒకసారి ఆలోచిస్తే ఇలా ఒక తండ్రి అవమానించడం సహజమే కాని తల్లి, భార్య అవమానించి యుద్ధసన్నద్ధుని చేసి పంపడంలో ఇలాంటి స్త్రీలున్నారా అంటే దాదాపు లేరనే చెప్పాలి కాదంటారా?

+++++104

14 వ శతాబ్దానికి చెందిన అవ్వయార్ (తమిళ కవయిత్రిచెప్పిన చాటువు (

ఈమె చేర, చోళ, పాండ్య రాజాస్థానాలను సంర్శించినపుడు చెప్పిన చాటువు-

వాదవర్ కోన్ పిన్నై యెండ్రాన్

వత్తవర్ కోన్ నాళై యెండ్రాన్

యాదవర్ కోన్ యాదోస్త్రుమ్

ఇల్లై ఎండ్రాన్ ఆదలాల్

వాదర్ కోన్ పిన్నై యినుం,

వత్తవర్ కోన్ నాళై ఎనుం

యాదవర్ కోన్ ఇల్లై ఇనియ

వాదవర్ అనే నృపాలుడు తరువాత రమ్మన్నాడు వత్తవర్ రేపు రమ్మన్నాడుయాదవర్ .

లేదన్నాడు ఈ ముప్వురిలో తరువాత, రేపు అని చెప్పి వాయిదా వేసిన వారికన్న లేదని

నిశ్చయంగా చెప్పిన వాడే

ఉత్తముడు అని భావం -

+++++105

నాళీకంబు నళీకయుక్తి బయలైనన్ మధ్యమశ్రీకికో

పై లెక్కింపగ నాపయిన్ గుచవచప్రారూఢికాపైజనన్

బాలాగ్రీవకు సాటిగామిగరమున్ బ్రార్థించి పాదంబున్

వ్రాలన్ వ్రీలెనళీకయుక్తి సతికన్ సన్నన్మెలంగెం దుదిన్

(నానార్థగాంభీర్యచమత్కారిక పుట-38)

నాళీకము, అసత్యమైన యుక్తిచేత అనగా - ళీ- అనే వర్ణాన్ని లేకపోతె అనగా నళీకము - లో ళీ - తొలగించిన- నాకము అనగా

ఆకాశం గా మధ్యమశ్రీకి సరిఅయినది. అంటే శ్రీ అనే అక్షరంలో మధ్యము(నడుము) లేదుకదా.

అలాగే నాళీకములో నా- తీసి కో, పై లు పెట్టిన కోకము, పైకము అవుతాయి. కోకము అంటే

చక్రవాకము ఇది కుచ ప్రారూఢికి, కుచ ప్రశస్తికి, పైకము- కోకిల సమూహము వాక్ ప్రశస్తికి,

కాపైజనన్ - నాళీకములో క- తీసివేసిన నాళీ, నాళము బాలయొక్క కంఠమునకు

సాటిఅయినదిగాను. నాళీకము అనగా పద్మముకావున హస్తములను ప్రార్థించిన పాదములకు

ఒడెను. ళీ, క - లు తీసివేసిన

నా - అయి అనగా పురుషుడు సతియొక్క కనుసన్నలలో సంచరిచును అని తాత్పర్యము. దీనిలో

అక్షరాలను తీసివేస్తూ పోవడం జరుగుతూంది

కావున ఇది అక్షర**చ్యుతక చిత్రము.**

+++++106

కపిలవాయి లింగమూర్తిగారి **ఆర్యా శతకం**లోని ఒక చిత్రం చూడండి-

జవరాలి యందునుంగల

వివరాలు వరాలురాలు విరసంబైనస్

తవులుసుమి రాలు చెలువుడు

మివుల రసికుడైన గాక వినుమా యార్యా!

దీనిలో జవరాలు అనే పదంనుండి జ తీసివేస్తే వరాలు, వరాలు పదంనుండి వ తీసివేస్తే రాలు అవుతాయి. అంటే జవరాలు లో వరాలు, రాలు రెండూ ఉన్నాయి. ఆమె చెలువుడు అనుకూలుడైతే అతనికి వరాలు లభిస్తాయి.

అలా కాకుండా దుష్టుడాయెనా రాలు మాత్రం తగులక తప్పవు.

జవరాలు, వరాలు, రాలు - మొదటి అక్షరం తీసివేస్తే

ఒకదానినుండి మరొకటి వస్తున్నాయికదా అందువల్ల

ఇది చ్యుత చిత్రమౌతుంది.

+++++107

శ్రీచామరాజనగరీ రామశాస్త్రిగారి **సీతారావణసంవాదఝరీ** పూర్వభాగంలోని

మొదటి శ్లోకం చూడండి-

పరిక్షీణాలస్య:కులపతి:సమరభువి రక్ష :

సలజ్జ:స్వస్తుత్యామమలహితమార్గైకపథిక :

ప్రణమ్రస్త్రీలభ్యచ సుముఖి విలసత్కీర్తిరితి :

శ్రుతో నాహం కిం రే2ధమ ముహురలం త్వాంశ్రుతవతీ

రావణుడు తనను పొగడుకుంటూ సీతతో ఇలా అంటున్నాడు-

హేసుముఖి = అందమైన ముఖంగల ఓ సీతా !; **సమరభువి** = యుద్ధభూమి యందు,

పరిక్షీణాలస్య: = తొలగిన అలసత్వం కలవాడను

(అలసత్వం లేనివాడను (, **రక్ష:కులపతి:** = రాక్షససమూహానికి ప్రభువును; **స్వస్తుత్యాం** = తన

స్తుతియందు; **సలజ్జ:** = లజ్జ కలవాడను;

అమలహితమార్గైకపథిక: = నిర్మలమూ హితమూ అయిన

మార్గమునందు ఒకే ఒక బాటసారిని; **నమ్రస్త్రీలభ్య:** = నమ్రత గల స్త్రీలచేత పొంద తగినవాడను;

విలసత్కీర్తిఇతి చ : = ప్రకాశిస్తూన్న కీర్తి కలవాడను;

అహమ్ = నేను ; **న శ్రుతకిమ్ :** = (నీచేతవినబడలేదా (?

సీత సమాధానం-

రే అధమ - ఓ అధముడా!; **అలమ్** - చాలును; **త్వామ్** - నిన్ను గూర్చి; **ముహు:** -

అనేకపర్యాయాలు, **శ్రుతవతీ** - విని ఉన్నాను.

నిగూఢార్థం -

అలమ్ - 'ల' - కారం లేనివానినిగా, త్వామ్ - నిన్ను, శ్రుతవతీ - విని ఉన్నాను.

రావణుని మాటలలోని "**ల**" తీసివేయగా -

పరిక్షీణాస్య:కుపతి:సమరభువి రక్ష :

సజ్జ :స్వస్తుత్యామమహితమార్గైకపథిక:

ప్రణమ్రస్త్రీభ్యసుముఖి విసత్కీర్తిరితి చ :

శ్రుతో నాహం కిం

సమరభువి = యుద్ధభూమి యందు, **పరిక్షీణాస్య= :** క్షీణించిన ముఖం కలవాడనీ, **రక్షకుపతి :**

= రాక్షసుల చెడ్డరాజనీ; **స్వస్తుత్యాం** = తన స్తుతియందు; **సజ్జ= :** ఎల్లపుడు సిద్ధంగా ఉండేవాడనీ;

అమహితమార్గైకపథిక= : చెడ్డమార్గంలో మాత్రమే నడచేవాడనీ,

స్త్రీభ్య= : స్త్రీల కొరకు, **ప్రణమ్ర- :** వంగేవాడనీ, **విసత్కీర్తి= ఇతి చ :** పోయిన సత్కీర్తి

కలవాడను(సత్కీర్తి లేనివాడనీ);

చాలాసార్లు విన్నాను.

ఈ విధంగా పదాలలోని ఒక అక్షరం మార్పు రావడంతో అర్థం పూర్తిగా మారిపోయింది. దీనిలోని "**ల**"

అనే అక్షరం తొలగిపోయింది

కావున ఇది **చ్యుతాక్షరిచిత్రం**

===================================108

ఈ **నామగోపన పద్యం** ఇది రావూరి దొరసామయ్యగారు

చెప్పిన పద్యం-

తామరసాక్షి నీవిపుడు దప్పక చెప్పవె నీదు భర్త పే

రేమియొ యన్న, నెచ్చెలికి నిట్టులనెన్ లతాంగి చంద్రుఁ డున్

భూమియుఁజూతము న్మధుపమున్ మఱి తండుల ముద్రివ ర్ణముల్

గామహిమధ్య వర్ణములఁ గన్గొన మద్విభు నామమయ్యెడిన్

ఆమె చెప్పిన పదాలకు మూడక్షరాల పదాలు

చంద్ర - రేదొర, భూమి - ధరణి, చూత - రసాల, మధుప- భ్రమర

తండులం - బియ్యము, ఈ పదాలలోని మధ్య అక్షరాలను కలిపిన

ఆమె భర్త పేరు వస్తుంది- **రేదొర**

ధరణి

రసాల

భ్రమర

బియ్యము

వీటి మధ్య అక్షరాలను తీసుకోగా వచ్చెడి పేరు **దొరసామయ్య**

ప్రచురణ దాతకు కృతజ్ఞతలు

సాహిత్య వినోద వీచికలు ముద్రించటానికి సహాయం చేసిన

నా మిత్రుడు, సహోద్యాయుడు, సాహితీమిత్రుడు,

స్నేహశీలి ఉదారుడు అయిన

శ్రీ వర్ధిరెడ్డి వెంకట రామిరెడ్డి గారి

కుమారుడు **శ్రీ వర్ధిరెడ్డి వెంకట జనార్ధన రెడ్డి**

పాఠశాల గణిత సహోద్యాయులు వారికి కృతజ్ఞతలు.

వారికి వారి కుటుంబసభ్యులకు భగవంతుడు

సర్వదా ఆయురారోగ్య ఐశ్వర్య వృద్ధిని భగవత్భక్తిని

ఇవ్వాలని మనసారా కోరుకుంటున్నాను

ఇట్లు

కూర్పరి

ఏ.వి.రమణరాజు

పేరు - ఏ.వి.రమణరాజు (అలంకారం వేంకటరమణరాజు)

బి.ఏ., బి.ఎడ్., తెలుగు పండిట్

జననం- 08-04-1962

పుట్టిన ఊరు - ప్రొద్దుటూరు, కడపజిల్లా

తండ్రి - అలంకారం ఆదిశేషంరాజు

కన్నతల్లి - లక్ష్మీదేవమ్మ పెంచిన తల్లి - కామేశ్వరమ్మ

నా భార్య - ఇందిరాదేవి

కుమారులు - ఎ. ఆదిత్యకుమార్, ఎ.వి.వసంతకుమార్,

కోడలు - రాజేశ్వరి

నా అక్షర గురువు - తంగెళ్ళ నారాయణరాజు

ఆధ్యాత్మిక గురువులు -

బాబూజీ మహరాజ్ శ్రీరామచంద్ర గురూజీ, మాస్టర్ చారి కోక్ సుయ్

వృత్తి - S.A. (తెలుగు)

పనిచేయు పాఠశాల - Z.P.H.S., పోట్లదుర్తి, యఱ్ఱగుంట్ల(మం),

కవితావ్యాసంగం ప్రారంభం - 1980నుండి, కలంపేరు(ఒకప్పుడు)- హాసచంద్రిక

సాహితీస్ఫూర్తి- సరస్వతి వెంకమరాజు , అలంకారం కోటంరాజు,

కొడవలూరు రామచంద్రరాజు (శతాధిక గ్రంథకర్త)

ఇప్పుడు నడుపుతున్న బ్లాగులు- చిత్రకవితా ప్రపంచం, సాహితీనందనం, సాహితీసదస్

గూగుల్ సైట్ - చిత్రసాహితి,

వ్రాసినవి - తెలుగులో కందపద్యం (పరిశోధక వ్యాసం- 2 భాగాలు), చిత్రకవిత్వపరిచయము - అవగాహన,

పొడుపుకథలు - ప్రహేళికలు, సూక్తి సుధామధురం, ఏకాక్షరనిఘంటువు, చమత్కార పద్యాలు,

అనేక కవితలు, ఖండికలు.

శోధిస్తున్న అంశం- చిత్రకవితా సౌరభం (చిత్రకవితా పరిశోధక బృహద్గ్రంథము)

పొందిన సత్కారాలు - జిల్లాఉత్తమ ఉపాధ్యాయుడు (2012),

ఎఱ్ఱాప్రెగ్గడ సాహితీపుస్కారము(2016)

నడిపిన పత్రిక - ఉద్యోగ లక్ష్యం(విద్యా ఉద్యోగ పక్షపత్రిక)

1999 డిసెంబరు నుండి 2000 ఏప్రిల్ వరకు)

నడిపిన సంస్థలు - వివేకానంద కోచింగ్ సెంటర్ (1990 నుండు 2014 వరకు)

అభ్యుదయ విద్యామందిర్ (1980-81)